ఆదివారం
17-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 265
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏప్రిల్ 17న క్రొయేషియా సార్వత్రిక ఎన్నికలు

బెల్‌గ్రేడ్: క్రొయేషియా సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ 17న జరుగుతాయని అధ్యక్షుడు జోరన్ మిలానోవిక్ ఒక ప్రకటన చేశారు. కింగ్‌డమ్ ఆఫ్ క్రొయేషియా 1100వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లపై క్రొయేషియా సబర్‌లో చట్టసభ్యులు సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ ఒప్పందాలను ఆమోదించారు. సహజ వాయువు, ఇతర ఇంధనాలపై వాట్ రేటును తగ్గించారు. అనేక ఆర్థికపరమైన చర్యలకు ఆమోదం తెలిపారు. క్రిమినల్ కోడ్‌ను సవరించారు. శాసనసభ రద్దునకు ఓటు వేశారు. ఇదే క్రమంలో క్రొయేషియన్ సబూర్‌కు చట్టసభ్యుల ఎన్నిక ఏప్రిల్ 17న జరుగుతుందని మిలానోవిక్ నిర్ణయించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది.

ఎన్నికలకు వేళాయె

షెడ్యూల్ ప్రకటించిన ఈసీ

- 22 రాష్ట్రాలకు ఏడు దశల్లో పోలింగ్
- ఏప్రిల్ 19 నుంచి జూన్ ఒకటి వరకు
- మే 13న తెలుగు రాష్ట్రాలకు...
- జూన్ 4న ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. పోలింగ్ తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) శనివారం ప్రకటించింది. 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని తెలిపింది. ఏప్రిల్ 19న తొలి విడత ఎన్నికలు జరుగగా తుది విడత జూన్ 1న ఉంటుందని పేర్కొంది. ఫలితాలు జూన్ 4న వెలువడతాయని వెల్లడించింది. అలాగే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మే 13న ఒకేసారి లోక్‌సభకు ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలోని 25, తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలకు, ఏపీ అసెంబ్లీకి పోలింగ్ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 19 నుంచి మొదలై ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1వ తేదీతో ఎన్నికలు ముగుస్తాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.

షెడ్యూల్ ఇలా...

ఏప్రిల్ 19న జరిగే తొలి విడత కోసం నోటిఫికేషన్ ఈనెల 20న వెలువడుతుంది. ఏప్రిల్ 27వ తేదీతో నామినేషన్ల స్వీకరణకు గడువు ముగుస్తుంది. 28న నామినేషన్ల పరిశీలన, 30తో నామినేషన్ల ఉపసంహరణ ముగుస్తాయి. ఈ దశలో మొత్తం 102 స్థానాల్లో ఎన్నికలు జరుగుతాయి. రెండవ విడత పోలింగ్‌కు నోటిఫికేషన్ ఈనెల 28న వెలువడుతుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ ఏప్రిల్ 4 కాగా 5వ తేదీన నామినేషన్లు పరిశీలిస్తారు. వాటి ఉపసంహరణకు ఆఖరు తేదీ ఏప్రిల్ 8. మొత్తం 80 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ జరుగుతుంది. మూడవ దశ పోలింగ్ కోసం నోటిఫికేషన్ ఏప్రిల్ 12న వస్తుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ ఏప్రిల్ 19 కాగా నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 20న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఏప్రిల్ 22తో ముగుస్తుంది. మే 7న మొత్తం 94 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తారు. నాలుగో విడతకు నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వెలువుడుతుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ ఏప్రిల్ 25 కాగా 26న నామినేషన్లు పరిశీలిస్తారు. ఏప్రిల్ 29వ తేదీతో నామినేషన్ల

- మిగతా 2 లో

మే 13న పోలింగ్

- ఏపీ, తెలంగాణలో ఒకే విడత ఎన్నికలు
- ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 46,165 పోలింగ్ కేంద్రాలు
- 85 ఏళ్లు దాటినవారికి ఇంటి నుంచి ఓటేసే అవకాశం
- ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని 175 శాసనసభ నియోజకవర్గాలకు, 25 లోక్‌సభ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో ఏపీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూలును మీనా మీడియాకు వివరించారు. ఏప్రిల్ 18న ఏపీలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదేరోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, 9న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. మే 13న రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. పోలింగ్ నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 46 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంకే మీనా తెలిపారు. ఫామ్ 12తో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చన్నారు. 85 ఏళ్లు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి నెలాఖరులోగా ఓటరు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఓటరు కార్డు లేకుంటే 12 రకాల గుర్తింపు కార్డులు

- మిగతా 2 లో

23 వరకు కవితకు కస్టడీ

- 10 రోజులు కోరితే వారానికి అనుమతిచ్చిన ఢిల్లీ కోర్టు
- అక్రమ అరెస్టన్న వాదనను తోసిపుచ్చిన న్యాయస్థానం
- ఎమ్మెల్సీ భర్తకూ ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ నేత, తెలంగాణ ఎమ్మెల్సీ కె.కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి పంపుతూ ఢిల్లీ రేస్ కోర్స్ అవెన్యూ ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశాలిచ్చింది. ఈనెల 23వ తేదీ వరకు కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆమెను ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగపాల్ ఎదుట హాజరుపర్చి పది రోజుల కస్టడీని ఈడీ

- మిగతా 2 లో

ఏపీకి ప్రశ్నించే గొంతు అవసరం

- అందుకే షర్మిల వచ్చారు
- బీజేపీకి బాబు, జగన్, పవన్ సలాం
- విశాఖ సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం/గాజువాక: ఢిల్లీ నుంచి సుల్తాన్‌లు వచ్చినా 'విశాఖ ఉక్కు'ను ఒక్క అంగుళం కూడా కదిలించలేరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' పేరుతో శనివారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల నడుం బిగించారని, ఉక్కు సంకల్పంతో సభ పెట్టారన్నారు. వైఎస్ఆర్ సంకల్పాన్ని నిలబెట్టే వారే ఆయన వారసులవుతారని, ఏపీ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టేవారు వారసులు కారన్నారు. ప్రశ్నించే నాయకుడు లేకే ప్రధాని మోదీ ఏపీని పట్టించుకోవడం లేదని, ఢిల్లీని డిమాండ్ చేసి, కావాల్సింది సాధించుకునే నాయకత్వం రాష్ట్రానికి కరువైందన్నారు. అందుకే పదేళ్లయినా ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేదని, పోలవరం పూర్తి కాలేదన్నారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని ఎద్దేవా చేశారు. ఇదే మోదీ బలగమని రేవంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎవరు గెలిచినా మోదీకి మద్దతిచ్చే వారేనని, ఈ ప్రాంత సమస్యలపై నిటారుగా కొట్లాడే నాయకులు కావాలన్నారు. ఏపీ ప్రజలకు కావాల్సింది పాలకులు కాదని, ప్రశ్నించే గొంతుకలని చెప్పారు. తెలుగువారి హక్కులు కాపాడుకొనేందుకు అంతా ఏకమవుదామని, ఏపీ ప్రజలు కష్టాల్లో ఉన్నందుకే షర్మిల ఇక్కడకు వచ్చారన్నారు. ఎవరో వచ్చి విశాఖ ఉక్కును అమ్ముతామంటే ఊరుకోబోమని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏపీలో పోరాటం ఎంత కష్టమో ఆమెకు తెలుసునని, అయినా ఏపీ ప్రజల తరపున నిలబడే నాయకురాలు షర్మిల అన్నారు. రానున్న ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలు, 5 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని, చట్టసభల్లో మీ కోసం పోరాటం చేస్తారన్నారు. వైఎస్సార్ ఆశయాలకు వ్యతిరేకంగా మాట్లాడేవారు ఆయన వారసులు ఎలా అవుతారని ఏపీ సీఎం జగన్ పేరెత్తకుండానే విమర్శల వర్షం కురిపించారు. మోదీ ఏపీని శాసించాలని అనుకుంటున్నారన్నారు. విశాఖ సభను చూస్తుంటే హైదరాబాద్‌లో సభ జరుగుతున్నట్టు ఉందని రేవంత్ రెడ్డి

- మిగతా 2 లో

వైసీపీ జట్టు ఇదే

- 175 ఎమ్మెల్యే...24 ఎంపీ అభ్యర్థుల పేర్ల వెల్లడి
- జాబితా ప్రకటించిన ధర్మాన, నందిగం సురేశ్
- సామాజిక న్యాయం చేతల్లో చూపించాం: జగన్

విశాలాంధ్ర-వేంపల్లె: సామాజిక న్యాయమనేది మాటల్లో కాకుండా చేతల్లో చూపించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలం ఇడుపులపాయ వైఎస్సార్ ఎస్టేట్‌లో శనివారం ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో మొత్తం 175 అసెంబ్లీ, 24 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ 50 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు దక్కేలా వైసీపీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఈ చట్టం ప్రకారం సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పేర్లను మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ నందిగం సురేశ్ వెల్లడించారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం మినహా మిగిలిన 24 స్థానాలకు అభ్యర్థుల పేర్లను నందిగం సురేశ్ ప్రకటించారు. ఎంపీ అభ్యర్థులుగా...శ్రీకాకుళం - పేరాడ తిలక్, విజయనగరం - బెల్లాన చంద్రశేఖర్, విశాఖపట్నం- బొత్స ఝాన్సీ, అరకు-చెట్టి తనూజరాణి (ఎస్టీ), కాకినాడ - చెలమలశెట్టి సునీల్ (ఓసీ),

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మద్యం కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఈడీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ

- మిగతా 2 లో

సామాజిక ముద్రకు యత్నం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం
- మహిళల సీట్లసంఖ్య స్వల్పంగా పెంపు
- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితా ప్రకటించిన వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితాలో వైసీపీ సామాజికముద్ర కనిపించింది. రాబోయే సార్వతిక్ర ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం సీట్లు కేటాయించింది. 2019 ఎన్నికల జాబితాతో పోలిస్తే ఇందులో బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేసింది. మహిళలకూ సీట్ల సంఖ్య పెంచింది. వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ వైఎస్ఆర్ ఘాట్ వద్ద సీఎం జగన్ సమక్షంలో శనివారం 175 అసెంబ్లీ, 24 ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. అమలాపురం ఎంపీ స్థానాన్ని పెండింగ్‌లో ఉంచారు. పార్లమెంట్ అభ్యర్థుల జాబితాను ఎంపీ నందిగం సురేశ్, అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను మంత్రి ధర్మాన ప్రసాదరావు చదివారు. 175 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లలో 50 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించారు. బీసీలలోని ఉపకులాలకు ప్రాధాన్యత క్రమంలో సీట్లు దక్కాయి. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలైన మొత్తం 200 సీట్లలో ఎస్సీలకు

- మిగతా 2 లో

'ప్రజాగళం'కు సర్వం సిద్ధం

2 లో

టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల శంఖారావం పూరించనున్నాయి. ఇందుకు ఆదివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో 'ప్రజాగళం' పేరుతో నిర్వహించే బహిరంగ సభ వేదిక కానున్నది.

పలస్తీనా కొత్త ప్రధాని మహమ్మద్ ముస్తఫా

రమల్లా: పలస్తీనా నూతన ప్రధానమంత్రిగా మహమ్మద్ ముస్తఫా నియమితులయ్యారు. సుదీర్ఘ కాలంగా ప్రధానికి సలహాదారుగా ఉన్న ముస్తఫాకు ప్రధాని బాధ్యతలను మహమూద్ అబ్బాస్ (ఆపద్ధర్మ ప్రధాని) నిర్ణయం తీసుకున్నారు. పలస్తీనా యంత్రాంగంలో సంస్కరణల కోసం ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ నియామకాన్ని చేపట్టారు. ఆర్థికవేత్త ముస్తఫా అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీలో చదువుకున్నారు. పలస్తీనా విమోచన సంస్థ (పీఎల్‌వో)లో సభ్యుడిగా ఉన్నారు. ప్రపంచ బ్యాంకులో పనిచేశారు. ప్రధాని అబ్బాస్ గతనెలలో తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా ఒత్తిడితోనే ముస్తఫాను ప్రధానిగా నియమించినట్లు తెలుస్తోంది. కొత్త ప్రధాని బాధ్యతలు ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో చాలా పరిమితంగా ఉండనున్నాయి. ధ్వంసమైన గాజా పునర్నిర్మాణం, వ్యవస్థల సంస్కరణల బాధ్యతలను ముస్తఫాకు అప్పగించనున్నారు.

స్లోవేకియా ప్రభుత్వ విధానాలపై ప్రజల కన్నెర్ర

15 వేల మందితో భారీ ర్యాలీ

బ్రటిస్లావా: స్లోవేకియాలోని రికో ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలపై ప్రజలు కన్నెర్ర చేశారు. మీడియా స్వేచ్ఛను హరించే విధంగా చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రస్తుత కేబినెట్ తీసుకొచ్చిన విదేశాంగ విధానాన్ని నిరసనకారులు వ్యతిరేకించారు. 15వేల మందికిపైగా వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. ప్రతిపక్ష పార్టీలైన ప్రోగ్రెసివ్ స్లోవేకియా, ఫ్రీడమ్ అండ్ సాలిడరిటీ పిలుపు మేరకు రాజధాని బ్రటిస్లావాతో పాటు కోసైస్ సహా పెద్ద నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. బ్రటిస్లావా, కోసైస్‌లో వీధులన్నీ నిరసనకారులతో నిండిపోయాయి. రేడియో, టెలివిజన్ ఆఫ్ స్లోవేకియా (ఆర్‌టీవీఎస్)ను తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలని, మీడియా స్వేచ్ఛను హరించాలని పాలక పక్షం చూస్తోందని విపక్ష పార్టీలు ఆరోపించాయి. ఆర్‌టీవీఎస్‌ను వదులుకోబోమన్న బ్యానర్లను నిరసనకారులు ప్రదర్శించారు. 2023 చివరి నుంచి స్లోవేకియాలో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి.

ఉక్రెయిన్‌లోని ఆక్రమిత ప్రాంతాల్లో రష్యా ఎన్నికలు

60 ఐరాస దేశాల ఖండన

జెనీవా: ఉక్రెయిన్‌లోని ఆక్రమిత ప్రాంతాల్లో అధ్యక్ష ఎన్నికలను రష్యా నిర్వహించడాన్ని ఐక్యరాజ్య సమితిలోని 60 సభ్యదేశాలు ఖండించాయి. ఇవి అక్రమ ఎన్నికలని విమర్శించాయి. యూరోపియన్ యూనియన్‌తో పాటు 50 ఐరాస సభ్యదేశాలు ఈ మేరకు ఉమ్మడి ప్రకటన చేశాయి. మరో దేశ భూభాగంలో ఎన్నికలు నిర్వహించడం ఆ దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించడమే అవుతుందని దుయ్యబట్టాయి. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఇలాంటి ఎన్నికలు చెల్లబోవని పేర్కొన్నాయి. రిపబ్లిక్ ఆఫ్ క్రిమియా, సెవాస్టోపోల్‌తో పాటు డొంటెస్క్, ఖేర్సన్, లుహాన్క్, జపారిజ్‌జియా ప్రాంతాల హోదాలో ఎటువంటి మార్పును గుర్తించబోమని రష్యాకు తేల్చిచెప్పాయి.

తాత్కాలిక ఆక్రమిత ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించడాన్ని ఆక్షేపించాయి. ఉక్రెయిన్‌లోని భూభాగాల్లో ఎన్నికలు జరపవద్దని రష్యా ఫెడరేషన్‌ను డిమాండ్ చేశాయి.

కిడ్నీ వ్యాధితో వార్డ్ మెంబర్ మృతి

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం పంచాయతీ పరిధిలోని దీప్లానగర్ తండాకు చెందిన వార్డ్ మెంబర్‌ను కిడ్నీ రక్కసి బలితీసుకుంది. వివరాలివి. భరోతు జమక (51) గత పది సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆమెకు వైద్యం చేయిస్తూనే ఉన్నారు. వ్యాధి తీవ్రం కావడంతో రెండు సంవత్సరాలుగా డయాలసిస్ చేయిస్తున్నారు. ఉన్నట్టుండి శనివారం ఇంటి వద్దే ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త మంగన మాట్లాడుతూ, తన భార్య జమక పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్టు చెప్పాడు. వైద్య ఖర్చులకు అప్పులు చేసి మరీ వైద్యం చేయించినా దక్కలేదంటూ విలపించాడు. జమక మరణవార్త గిరిజన తండాలకు తెలియడంతో వ్యాధిగ్రస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు ప్రభుత్వం కృష్ణా జలాలను ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుందని, వారం రోజులుగా నీళ్ల ట్యాంకర్లు రావడంలేదని చెప్పారు. మృతురాలు జమక గత పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ తరపున వార్డు మెంబర్‌గా పోటీ చేసి గెలిచిందన్నారు.

సీపీఐ నేతల శ్రద్ధాంజలి:

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, తిరువూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు తూము కృష్ణయ్య, మండల కార్యదర్శి మేకల దేవిడ్ తదితరులు జమక మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

అనంతరం శంకర్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి గిరిజనుల ప్రాణాలను బలిగొంటుంటే ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్రలో ఉందన్నారు. ఇదిలా ఉండగా, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావుకు ఫోన్ చేసి మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం చేయాలని కోరగా, స్పందించిన ఆయన ఎ. కొండూరు తహసిల్దార్ ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు, దోనేపూడి తన వంతుగా రూ.5వేలు అందజేశారు. ఎం. వెంకటేశ్వరరావు జి. జోజి బాబు, కొప్పాల తిరుపతయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. ఆనందరావు, డి. చిన్న పాల్గొన్నారు.

సామాజిక ముద్రకు యత్నం

(మొదటిపేజీ తరువాయి)

33 సీట్లు, ఎస్టీలకు ఎనిమిది, బీసీలకు 59, ఓసీలకు 100 సీట్లు (84 ఎమ్మెల్యే, 16 ఎంపీ స్థానాలు) ఉన్నాయి. ఇందులో ఏడుగురు మైనార్టీలు, 24 మంది మహిళలకు చోటు లభించింది. 175 ఎమ్మెల్యే సీట్లలో ఎస్సీలు 29, ఎస్టీలు ఏడు, బీసీలు 48, ఓసీలకు 91 కేటాయించారు. ఇందులో మైనార్టీలు ఏడు, మహిళలు 19 మందికి చోటు లభించింది. 25 ఎంపీ సీట్లలో ఎస్సీలకు నాలుగు, ఎస్టీ ఒకటి, బీసీలకు 11, ఓసీలకు తొమ్మిది సీట్లు దక్కాయి. ఎంపీ జాబితాలో ఐదుగురు మహిళలకు చోటుదక్కింది.

2019 జాబితాతో పోలిస్తే 2024 ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు సీట్ల సంఖ్య పెరిగింది. 2019లో 175 ఎమ్మెల్యే స్థానాలకుగాను ఎస్సీలకు 29, ఎస్టీలకు ఏడు, బీసీలకు 41 స్థానాలు కలిపి మొత్తం 77 కేటాయించారు. 2024లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మొత్తం 84 సీట్లు దక్కాయి. ఇందులో ఎస్సీలు 29, ఎస్టీలు ఏడు, బీసీలు 48 మంది ఉన్నారు. 2019లో అసెంబ్లీకి మహిళలకు 15, మైనార్టీలకు ఐదు సీట్లు కేటాయించగా, 2024లో మహిళలకు 19, మైనార్టీలకు ఏడు కట్టబెట్టారు. 2019లో 25 ఎంపీ స్థానాలకుగాను ఎస్సీలకు నాలుగు, ఎస్టీలకు ఒకటి, బీసీలకు ఏడు కలిపి మొత్తం 12 స్థానాలు దక్కాయి. 2024 ఎన్నికల్లో ఎస్సీలకు నాలుగు, ఎస్టీలకు ఒకటి, బీసీలకు 11 కలిపి 16 సీట్లు కేటాయించారు. 2019లో మహిళలకు నాలుగు ఎంపీ స్థానాలు కేటాయించగా, ఆ సంఖ్య 2024లో ఐదుకు చేరింది. మొత్తం 175 ఎమ్మెల్యే స్థానాలలో 75 శాతం మంది విద్యావంతులున్నారు. వారిలో 131 మంది పట్టభద్రులు, ఆపై విద్యార్హత గల అభ్యర్థులు ఉన్నారు. ఎమ్మెల్యేలలో 13 మంది వైద్యులు, 11 మంది న్యాయవాదులు, 34 మంది ఇంజినీర్లు, ఐదుగురు టీచర్లు, ఇద్దరు సివిల్ సర్వెంట్లు, డిఫెన్స్ సర్వీస్, జర్నలిస్టు ఒకరు చొప్పున ఉన్నారు. స్థానిక సంస్థలైన జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లతోపాటు సామాన్యకర్తల నుంచి ఎమ్మెల్యేలుగా 14 మందికి సీట్లు కేటాయించారు. 25 ఎంపీలలో 22 మంది గ్రాడ్యుయేట్లు, 11 మంది పోస్టు గ్రాడ్యుయేట్లు, ఇద్దరు పీహెచ్‌డీలున్నారు. వారిలో నలుగురు డాక్టర్లు, ఒకరు సీఏ, మెడికల్ ప్రాక్టీషనర్లకు ఎంపీ సీట్లు కేటాయించారు.

మద్యం కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఆయనకు రౌస్ అవెన్యూ కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. ఈ ఉదయం కోర్టుకు హాజరైన కేజ్రీవాల్‌కు... రూ.15 వేల పూచీకత్తుతో బెయిల్ ఇచ్చింది. దిల్లీ మద్యం పాలసీలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కేజ్రీవాల్ విచారణకు హాజరు కావాలంటూ ఈడీ ఇప్పటికే 8 సార్లు సమన్లు జారీ చేసింది. అయితే, ఆ సమన్లను దాటవేస్తున్న కేజ్రీవాల్... రాజకీయ ప్రేరేపిత కుట్ర అని ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం... తమను వేధించేందుకే ఈ కేసులు పెట్టించిందని విమర్శిస్తున్నారు. కాగా, మద్యం కేసులో ఈడీ విచారణకు హాజరుకాని కేజ్రీవాల్ అరెస్టుకు మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ తీర్పుపై స్టే విధించాలని కోరుతూ కేజ్రీవాల్ పెట్టుకున్న అభ్యర్థనను సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోసం విచారణ కోర్టును ఆశ్రయించాలని అదనపు సెషన్స్ జడ్జి రాకేశ్ సియాల్ సూచించారు. కోర్టుకు హాజరుకావాలని స్పష్టం చేశారు. దీంతో కేజ్రీవాల్ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి కోర్టు...కేజ్రీవాల్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. తాము పంపుతోన్న సమన్లకు స్పందించడం లేదంటూ ఈడీ అధికారులు కోర్టును ఆశ్రయించారు. మొదటి మూడు సమన్లకు కేజ్రీవాల్ రాలేదని మెజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన మెజిస్ట్రేట్ కోర్టు... ఫిబ్రవరి 17 విచారణకు వెళ్లాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. అయితే, ఆ సమయంలో అసెంబ్లీలో తమ ప్రభుత్వానికి విశ్వాస పరీక్ష ఉండటంతో కేజ్రీవాల్ వర్చువల్‌గా హాజరయ్యారు. తర్వాత విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని, అందుకు అనుమతివ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనికి కోర్టు అంగీకరించింది. దీనిపై విచారణ కొనసాగుతుండగానే ఈడీ పదే పదే సమన్లు పంపింది. మార్చి 4న విచారణకు రావాలని పిలవగా... కేజ్రీవాల్ పట్టించుకోలేదు. దీంతో ఈడీ మరోసారి కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సెషన్స్ కోర్టు... మార్చి 16న తప్పనిసరిగా హాజరుకావాలని మరోసారి సమన్లు జారీ చేసింది.

'ప్రజాగళం'కు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల శంఖారావం పూరించనున్నాయి. ఇందుకు ఆదివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో 'ప్రజాగళం' పేరుతో నిర్వహించే బహిరంగ సభ వేదిక కానున్నది. ప్రధాని మోదీ హాజరవుతున్న ఈ కార్యక్రమాన్ని మూడు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మూడు పార్టీల నేతల పర్యవేక్షణలో పనులు చకచకా జరిగాయి.

300 ఎకరాల విస్తీర్ణంలో..

బొప్పూడి వద్ద 300 ఎకరాలలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. 225 ఎకరాలను వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్లకు కేటాయించారు. 75 ఎకరాల్లో సభా వేదిక, వీఐపీలు, ప్రజలకు వేర్వేరుగా గ్యాలరీలు ఉండనున్నాయి. ఎనిమిది అడుగుల ఎత్తులో ప్రధాన వేదిక నిర్మించారు. మోదీతోపాటు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ హాజరవుతారు కాబట్టి మొత్తం ఏడు హెలిప్యాడ్లు ఏర్పాటు చేశారు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పక్కనే సభ ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. కాగా, జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి, పార్టీల నేతలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ట్రయల్ కాన్వాయ్‌ను నిర్వహించారు.

ఏపీకి ప్రశ్నించే గొంతు అవసరం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఏపీకి రాజధాని ఏది అంటే చెప్పలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్ హయాంలో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఆయన గుర్తుచేశారు. ఆరోగ్య శ్రీ తీసుకువచ్చి చాలామంది పేదల ప్రాణాలు కాపాడారని పేర్కొన్నారు. పేద పిల్లల చదువు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమాలన్నీ సక్రమంగా అమలు చేయడం కోసం షర్మిల ఏపీకి వచ్చారని చెప్పారు.

బీజేపీకి సమాధి కట్టాల్సిందే: నారాయణ

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ ప్రకటించారు. అదానీ గంజాయి స్మగ్లర్ అని, భవిష్యత్తులో స్టీల్‌ప్లాంట్‌ను గంజాయి గోదాముగా మార్చేందుకే మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకున్నారని విమర్శించారు. దేశ రాజకీయాలు మారాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలుగు ప్రజల్ని మోసం చేస్తున్న మోదీకి సమాధి కట్టాలని, తెలంగాణలో ఇప్పటికే రేవంత్‌రెడ్డి బీజేపీకి ఘోరీ కట్టారన్నారు. విభజన హామీలను తుంగలో తొక్కి పోలవరం రాజధాని నిర్మాణానికి నిధులు లేకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై ప్రశ్నించాలన్నారు.

జగన్‌ను ఇంటికి పంపడమే: షర్మిల

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం సీఎం జగన్ ఎందుకు ఉద్యమం చేయలేదని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. దిల్లీకి వెళ్లిన ప్రతిసారీ తనను, బాబాయి హంతకులను రక్షించుకోవడానికే జగనన్న ప్రయత్నించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడు నోరు విప్పలేదన్నారు. ప్రాణాలు అడ్డుపెట్టయినా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకొంటామని ప్రకటించారు. ఇప్పటికే గంగవరం పోర్టును అదానీకి అప్పగించారని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఇక్కడ పనిచేసే 30 వేల మంది కార్మికులు ఏమి కావాలని ప్రశ్నించారు. పరిశ్రమను ప్రైవేటుపరం చేయొద్దని అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకొంటే సరిపోతుందా అని నిలదీశారు. మరోసారి రైతులను, యువతను, మహిళలను, రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి జగన్ సిద్ధమవుతున్నారని, జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పడినప్పటి నుండి 9 మంది ముఖ్యమంత్రులు

దీని పరిరక్షణకు కృషి చేశారని, వైయస్ జగన్ మాత్రం కనీసం పోరాట నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి... వడ్డీ మాఫీ చేస్తే రోజుకు రూ.10 కోట్ల లాభాలు వస్తాయని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం నాటి ప్రధాని నెహ్రూ 256 ప్రభుత్వ రంగ పరిశ్రమలు నెలకొల్పితే...వాటిని మోదీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ భూముల అమ్మకానికే ప్రైవేటీకరణకు పూనుకున్నదన్నారు. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిని ఓడించాలని, రాష్ట్రాన్ని దివాలా తీయించిన జగన్‌ను ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరారెడ్డి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు, ప్రత్యేకహోదా రాకపోవడానికి, పోలవరం పూర్తి కాకపోవడానికి, ఈ రాష్ట్రం ఇంత అంధకారంలోకి వెళ్లిపోవడానికి ఆ నలుగురు ద్రోహులే కారణమన్నారు. వచ్చే ఎన్నికల్లో వారిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

సభలో సీపీఐ సీనియర్ నేత మానం ఆంజనేయులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, విజయనగరం జిల్లా కార్యదర్శి ఉమ్మి రమణ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణతోపాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు జేడీ శీలం, ఎంఎం పల్లంరాజు, అయ్యప్పన్, గిడుగు రుద్రరాజు, తులసిరెడ్డి, కేవీపీ రామచంద్రరావు, కనుమూరి బాపిరాజు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నాయకులు అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్పొరేటర్ గంగారావు పాల్గొన్నారు.

23 వరకు కవితకు కస్టడీ

(మొదటిపేజీ తరువాయి)

కోరింది కానీ కోర్టు ఏడు రోజులకే అనుమతిచ్చింది. కవిత అరెస్టు అక్రమమన్న ఆమె తరపు న్యాయవాదుల వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కవితను తిరిగి హాజరుపర్చాలని ఈడీని ఆదేశించింది. కస్టడీ కాలంలో కుటుంబ సభ్యులు, న్యాయవాదులను కలిసేందుకు, ఇంటి భోజనానికీ అనుమతించింది. తొలుత కవిత తరపున న్యాయవాదులు విక్రమ్ చౌదరి, మోహిత్ రావు, ఈడీ తరపున న్యాయవాదులు జోయబ్ హుస్సేన్, ఎన్‌కే మట్టా వాదనలు వినిపించారు. ఈడీ సమన్లు ఇచ్చినప్పుడు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశామని విక్రమ్ చౌదరి తెలిపారు. 2023, సెప్టెంబరు 15న ఈడీ తరపున సమన్లు ఇవ్వమని, కవితను అరెస్టు చేయబోమని చెప్పారన్నారు. అదే నెల 26న మరోసారి వాదనలు జరిగాయని, ఈడీ న్యాయవాదులే వాయిదాలు తీసుకున్నారని కోర్టుకు తెలిపారు. ఈడీ పిలిచినప్పుడల్లా కవిత విచారణకు హాజరయ్యారని వెల్లడించారు. కవిత పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నదని, తదుపరి విచారణను ఈనెల19వ తేదీకి సర్వోన్నత న్యాయస్థానం వాయిదా వేసిందని ఆయన తెలిపారు. సుప్రీంలో విచారణ జరిగేంత వరకు విచారణ నిలిపివేయాలని, అరెస్టు నుంచి కవితకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అతిక్రమిస్తూ... చట్టానికి తాము అతీతమని అధికారి భావించిన రోజు 'బ్లాక్ డే' అని అన్నారు. అంతకుముందు కవితతో మాట్లాడేందుకు ఐదు నిమిషాల సమయాన్ని న్యాయవాది కోరగా అందుకు కోర్టు అనుమతించింది. మరోవైపు కవితపై కఠిన చర్యలు తీసుకోబోమని సుప్రీంకోర్టుతో పాటు ఏ కోర్టులోనూ ఎలాంటి ప్రకటన చేయలేదని ఈడీ తెలిపింది. ఈ కేసులో కవిత పాత్ర ఉన్నదనేందుకు తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఆధారాలను ధ్వంసం చేసేందుకు ఆమె యత్నించినట్లు ఆరోపించింది. అనేక సమన్లు ఇచ్చినట్లు కూడా తెలిపింది. చార్జిషీటులో ఆమెను నిందితురాలిగా పేర్కొనకపోయినా సౌత్ గ్రూపులో కీలకంగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది.

ఇదిలావుంటే మద్యం కేసులో కవిత భర్త అనిల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. సోమవారం ఈడీ ఎదుట హాజరు కావాలని ఆయనకు ఆదేశాలిచ్చింది. ఈ కేసులో ఇప్పటికే అనిల్ ఫోన్లు సీజ్ చేసింది.

ఇది ఎన్నికల స్టంట్: రేవంత్ రెడ్డి

కవిత అరెస్టును ఎన్నికల స్టంట్‌గా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వర్ణించారు. కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయడానికే రాజకీయ డ్రామా అని దుయ్యబట్టారు. కవిత అరెస్టుపై ఆమె తండ్రి, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మౌనాన్ని ప్రశ్నించారు. ప్రధాని, ఈడీ ఒకేరోజు హైదరాబాద్‌కు రావడాన్ని ప్రస్తావించారు. ఈ కేసుపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడలేదన్నారు. కవిత అరెస్టుతో బీఆర్ఎస్‌కు సానుభూతి వస్తుందని, అవినీతిని సహించబోమని బీజేపీ చెప్పుకోవచ్చన్న కుట్ర కోణం దీని వెనుక ఉన్నదని, ఇదంతా ఓట్లు దండుకునే ప్రయత్నంలో భాగమేనని రేవంత్ రెడ్డి విమర్శించారు.

ఎన్నికలకు వేళాయే

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. మే 13న మొత్తం 96 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఐదో విడత కోసం నోటిఫికేషన్ ఏప్రిల్ 26న వస్తుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ మే 3 కాగా మే 4న వాటిని పరిశీలిస్తారు. మే 6వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు తేదీ. మే 20న 46 స్థానాలకు ఎన్నికలు జరుగుతతాయి. ఆరవ విడత పోలింగ్ కోసం నోటిఫికేషన్ ఏప్రిల్ 29న వెలువుడుతుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ మే 6 కాగా 7న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. వాటి ఉపసంహరణకు ఆఖరు తేదీ మే 9 కాగా మే 25న 57 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఏడవ దశ పోలింగ్ కోసం మే 7న నోటిఫికేషన్ వస్తుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ మే 14 కాగా ఉపసంహరణకు మే 17 వరకు గడువు ఉంటుంది. నామినేషన్ల పరిశీలన మే 15న జరుగుతుంది. జూన్ 1న 57 స్థానాల తుది దశలో పోలింగ్ జరుగుతుంది. మొత్తంగా 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకేరోజు ఎన్నికలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, సిక్కిం, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, చండీగఢ్, లఢక్, దాదర్ నాగర్ హవేలీ, డామన్, డయ్యూలో ఒకే రోజు పోలింగ్ నిర్వహిస్తారు.

26 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు

బీహార్, గుజరాత్, హర్యానా, తమిళనాడు, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, త్రిపుర, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, కర్నాటకలో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న ఒకే విడతలో అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం శాసనసభలకు, మే 13న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగునున్నాయి. ఒడిశా అసెంబ్లీ ఎన్నికలను మే 13, 20వ తేదీల్లో రెండు దశల్లో నిర్వహిస్తారు. 26 అసెంబ్లీ స్థానాల భర్తీకి షెడ్యూల్ రాగా మొత్తం ఏడు దశల్లో ఉప ఎన్నికలు జరుగుతాయి.

1.85 కోట్ల కొత్త ఓటర్లు: సీఈసీ

కొత్త ఓటర్లు 1.85 కోట్ల మంది ఉంటే మొత్తం ఓటర్లు 96.8 కోట్లని, వీరిలో 49.7 కోట్ల మంది పురుషులు, 47.1కోట్ల మంది మహిళలు, 48వేల మంది ట్రాన్స్‌జెండర్లు కాగా 82 లక్షల మంది 85ఏళ్లు పైబడిన వారు, 19.74 కోట్ల మంది 20-29 మధ్య వయస్కులు ఉన్నట్లు సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. 85 ఏళ్లు పైబడిన వారికి, వికలాంగులకు ఇంటి నుంచి ఓటువేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మొత్తం పదిన్నర లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా 55 లక్షల ఈవీఎంలను వినియోగించనున్నట్లు వెల్లడించారు. 1.5లక్షల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో ఉంటారని చెప్పారు. పోలింగ్ రోజున నిరంతర సమాచార సేకరణకు సామాజిక మాధ్యమాలు, వెబ్ కాస్టింగ్, 1950, గ్రీవెన్స్ పోర్టల్‌ను వినియోగిస్తామని, ఐదు మాధ్యమాల పర్యవేక్షణకు జిల్లాస్థాయి అధికారి ఉంటారని వివరించారు. రాష్ట్రాల మధ్య అనధికారంగా డబ్బు-వస్తు రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, నిశిత నిఘా పెడతామని తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దుల్లోనూ డ్రోన్ల సాయంతో నిఘా ఉంటుందన్నారు. అభ్యర్థుల పూర్తి వివరాలు కేవైసీ యాప్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయని అన్నారు. అభ్యర్థిపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తులు, అప్పులు తదితర వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. తాయిలాలు, నగదు పంపిణీ జరిగితే ఫొటో తీసి యాప్‌లో పెట్టాలని, ఫిర్యాది సెల్‌ఫోన్ లోకేషన్‌ను బట్టి ఆ ప్రాంతానికి కేవలం 100 నిమిషాల్లో చేరుకుంటామని సీఈసీ తెలిపారు.

ఎన్నికలకు సిద్ధం: సీఎం జగన్ ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలకు (మే 13) మేం సిద్ధం అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూలు జారీజేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు నాలుగవ విడతలో నిర్వహించనున్నట్లు సీఈసీ తెలిపింది. సామాజిక సమీకరణల ఆధారంగా 175 శాసన సభ, 24 లోక్‌సభ స్థానాలకు వైసీపీ ఒకే జాబితాతో అభ్యర్థులను ప్రకటించింది. ఈనెల 18 నుంచి ఎన్నికల ప్రచారానికి జగన్ సిద్ధమయ్యారు.

వైసీపీ జట్టు ఇదే

(మొదటిపేజీ తరువాయి)

అమలాపురం- రాపాక వరప్రసాద్ (ఎస్సీ), రాజమండ్రి- డా.గూడూరి శ్రీనివాసులు (బీసీ), నర్సాపురం- గూడూరి ఉమాబాల, ఏలూరు- కారుమూరి సునీల్ కుమార్, మచిలీపట్నం- సింహాద్రి చంద్రశేఖర్‌రావు (ఓసీ), విజయవాడ- కేశినేని నాని (ఓసీ), గుంటూరు-కిలారి వెంకట రోశయ్య (ఓసీ), నరసరావుపేట-అనిల్ కుమార్ యాదవ్ (బీసీ), బాపట్ల-నందిగం సురేశ్ (ఎస్సీ), ఒంగోలు-చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఓసీ), నెల్లూరు- వేణుంబాక విజయసాయిరెడ్డి (ఓసీ), తిరుపతి-మద్దిల గురుమూర్తి (ఎస్సీ), చిత్తూరు - రెడ్డప్ప (ఎస్సీ), రాజంపేట- పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి (ఓసీ), కడప- వైఎస్ అవినాశ్‌రెడ్డి (ఓసీ), కర్నూలు -బీవై రామయ్య(బీసీ), నంద్యాల- పోచ బ్రహ్మానందరెడ్డి (ఓసీ), హిందూపురం- జోలదరసి శాంత (బీసీ), అనంతపురం- మాలగుండ్ల శంకర నారాయణ (బీసీ) పేర్లను ప్రకటించారు.

మే 13న పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

చూపించొచ్చని వెల్లడించారు. 179 పోలింగ్ కేంద్రాలు ప్రత్యేకంగా మహిళలకు ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్‌కు ఐదు రోజుల ముందు ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమపై ఉన్న క్రిమినల్ కేసులను పేపర్, టీవీలలో మూడుసార్లు ప్రచురించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ నిమిత్తం మొత్తం 3.82 లక్షల మంది ఉద్యోగులను వినియోగిస్తున్నాం. ఎన్నికల ప్రచారం, ఖర్చు, నిర్వహణ అంశాల పరిశీలన కోసం అబ్జర్వర్లు ఉంటారు. ప్రతి అసెంబ్లీకి మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఉంటాయి. అనుమానిత ఖాతాలపై నిఘా ఉంటుంది. నాన్ కమర్షియల్ ప్రాంతాలలో ల్యాండ్ అయ్యే హెలికాప్టర్లను తనిఖీ చేస్తామన్నారు. 50 శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున బహిరంగ ప్రదేశాలలో 48 గంటలలోపు పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని సూచంచారు. ప్రభుత్వ వెబ్ సైట్ నుంచి వచ్చే 24 గంటలలోపు అన్ని ఫొటోలు తీసేయాల్సి ఉంటుందని, కొత్త పనులకు అనుమతి లేదన్నారు. జరుగుతున్న పనులకు ఇబ్బంది ఉండదన్నారు. మంత్రులు ఇక సమీక్షలు చేయకూడదని, వారికి ప్రోటోకాల్ కూడా ఉండదన్నారు. కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేయడానికి లేదని ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఇక రాష్ట్రంలో తాజా ఓటర్ల సంఖ్య 4,09,37,352 ఉండగా, ఇందులో సర్వీస్ ఓటర్ల సంఖ్య 67,393గా ఉందన్నారు. వీరిలో పురుష ఓటర్లు 2,00,84, 276 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,08,49, 730 మంది ఉన్నారు. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా ఓటర్లు 9,01,863 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి 4.07 కోట్ల మంది ఓటర్లు ఉంటే.. తాజాగా 1,97,000 మంది పెరిగారు.

తెలంగాణలోనూ అదే రోజు పోలింగ్

ఏపీతో పాటు తెలంగాణలోనూ ఒకేసారి, ఒకే రోజు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈసీ మొగ్గు చూపింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకేసారి లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరింది. ఇటీవల ఈసీ సమీక్షకు వచ్చినప్పుడు కూడా వినతి పత్రాలు సమర్పించింది. ఒకే రోజు ఎన్నికలు నిర్వహించడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చని చెబుతోంది. తెలంగాణలో ఓటర్లుగా నమోదైన వారంతా ఏపీలోనూ ఓటు నమోదు చేసుకున్నారని, రెండుచోట్ల ఓటు వేయకుండా నిరోధించడానికే తాము ఒకేసారి ఎన్నికల నిర్వహణ కోరుతున్నామని వైఎస్సార్‌సీపీ ఆ వినతుల్లో పేర్కొంది. మొత్తానికి మే 13న రెండు రాష్ట్రాల్లో ఒకేరోజు లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది.

కెనడాలో భారతీయ కుటుంబం సజీవదహనం

ఒట్టావా: కెనడాలో జరిగిన అగ్ని ప్రమాదంలో భారత సంతతికి చెందిన దంపతులు మృతిచెందారు. ఒంటారియా ప్రావిన్సులో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. మార్చి 7న బ్రాంప్టన్ వాన్ కిర్క్ డ్రైవ్ ప్రాంతంలోని బహుళ అంతస్తుల భవనంలోని ఓ నివాసంలో మంటలు చెలరేగినట్టు పేర్కొన్నారు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత దగ్ధమైన ఆ ఇంట్లో మృతదేహాల అవశేషాలు కనుగొన్నారు. అయితే ఆ సమయంలో ఎందరు చనిపోయారనేది నిర్ధారించలేకపోయారు. కానీ, చివరకు శుక్రవారం ఆ ప్రమాదంలో ముగ్గురు సజీవదహనమైనట్టు ధ్రువీకరించారు.

విశాలాంధ్ర

3

ఆదివారం

17 మార్చి 2024

యార్లగడ్డకు ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: బహుబాషా కోవిదుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. తెలుగు భాషా వికాసానికి గత మూడు దశాబ్దాలకు పైగా ఎనలేని కృషి చేస్తున్న ఢిల్లీ తెలుగు అకాడమీ, గ్లోబల్ తెలుగు అకాడమీ సంయుక్తంగా యార్లగడ్డకు ఉగాది పురస్కారం ప్రకటించాయి. సంస్థ 35వ వార్షిక సాంస్కృతిక, ఉగాది పురస్కారాల వేడుక ఢిల్లీలోని గోదావరి ఆడిటోరియం వేదికగా మార్చి 17వ తేదీన జరగనుండగా, అచార్య యార్లగడ్డకు 2024 సంవత్సరానికిగాను డాక్టర్ ఎన్‌వీఎల్ నాగరాజు స్మారక అవార్డు అందించనున్నారు. మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, న్యాయమూర్తులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు పాలుపంచుకోనున్నారు. విశ్వహిందీ పరిషత్తు జాతీయ అధ్యక్షుడి హోదాలో కజకిస్థాన్ పర్యటనలో ఉన్న యార్లగడ్డ శనివారం స్వదేశానికి చేరుకోనున్నారు. తెలుగు, హిందీ భాషా అభివృద్ధికి ఇటు దేశంలోనూ. అటు విదేశాలలోనూ అవిరళ కృషి చేస్తున్న లక్ష్మీ ప్రసాద్‌కు ఈ గౌరవం దక్కటం అభినందనీయమని భాషాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలపై సీబీఐ విచారణ జరపండి

విశాలాంధ్ర-విజయవాడ: గ్రూప్-1 (2018) మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో జరిగిన అనేక అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గ్రూపు -1 ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారనీ, కోర్టు విచారణ జరిపి అక్రమాలు జరిగాయని గుర్తించిన అనంతరం మెయిన్ పరీక్షను రద్దు చేయాలని తీర్పు ఇవ్వటం జరిగిందన్నారు. నిరుద్యోగుల ఉద్యమాల వల్లే 2018 నోటిఫికేషన్ వచ్చిందన్నారు. ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చిన వెంటనే మెయిన్ ఎగ్జామ్స్

నిర్వహించటం జరిగిందన్నారు. పరీక్ష పేపర్లను డిజిటల్ వాల్యుయేషన్ చేయడం ద్వారా తమకు నష్టం జరిగిందని నిరుద్యోగులు గొడవ చేసిన నేపథ్యంలో హైకోర్టు డిజిటల్ వాల్యుయేషన్ కాకుండా మాన్యువల్ వాల్యుయేషన్ చేయాలని చెప్పిన తరువాత కూడా మాన్యువల్ వాల్యుయేషన్ చేసినట్టు ఏపీపీఎస్సీ చెప్పడం దారుణం అన్నారు. జాయింట్ కలెక్టర్ ఉద్యోగం కోసం రూ.రెండున్నర కోట్లు, డీఎస్పీకి కోటి రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయన్నారు. అక్రమాలపై సమగ్ర విచారణ కోసం సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. ఈ అంశాన్ని రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఏపీపీఎస్సీ చైర్మన్, కార్యదర్శి, సభ్యుల జోక్యం ఉందని, విచారణ జరిపించడం వల్ల నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, జిల్లా నాయకుడు అజయ్ పాల్గొన్నారు.

బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు

- మనుధర్మాన్ని తరిమికొట్టాలి
- జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విశాఖ: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి హెచ్చరించారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో విశాఖలోని డాక్టర్ అంబేద్కర్ భవన్‌లో 'మనువాదం-దళితులు-రాజ్యాంగం' అంశంపై శనివారం సదస్సు జరిగింది. జేవీ సత్య నారాయణమూర్తి మాట్లాడుతూ బీజేపీ పాలకులు మను వాదాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళలు అణిచివేతకు గురవుతున్నారని, ఇందుకు మనుధర్మమే కారణమని చెప్పారు. సనాతన ధర్మం పేరుతో గతంలో సతీ సహగమనం, వర్ణ వ్యవస్థ, దేవదాసీ జోగినీ వ్యవస్థలు నడిచాయని గుర్తుచేశారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 80 శాతం ఉన్నారని, వారిని పట్టించుకోకుండా మనుధర్మాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. దేవదాసీ వ్యవస్థ మంచిదని నాడు బ్రాహ్మణులు అంటే, పెరియార్ దానిపై ఉద్యమించి రద్దు చేయించారని గుర్తుచేశారు. సనాతన ధర్మాన్ని దేశం నుండి పారద్రోలినప్పుడే అన్ని వర్గాలకీ సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ అంబేద్కర్ పేరు జపి స్తారని, కానీ ఆయన ఆశయాలను తుంగలో తొక్కుతు న్నారని విమర్శించారు. దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్న ప్రాంతాలకు దళిత నేతలను వెళ్లనీయడం లేదని, మనువాదులు అడ్డగిస్తున్నారన్నారు. మరో ముఖ్య అతిథి ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆచార్య కేఏస్ చలం మాట్లాడుతూ మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాం గం అమలు జరిగితేనే మనుగడ సాధ్యమన్నారు. యూదులకు, ఆర్యులకు దగ్గర సంబంధం ఉందన్నారు. 14 మంది మనువాదులు రాసిన గ్రంథాలు ఉన్నాయని తెలిపారు. సుమేరియా, సిరియా ప్రాంతాల నుండి భారత్‌కు ఆర్యులు వలస వచ్చారన్నారు. భూమిపై ఉన్న సమస్తం బ్రాహ్మణులదే అని, మనుధర్మం వారికి అనుకూలంగానే ఉందన్నారు. 2,690 శ్లోకాలు మనుధర్మంలో ఉన్నాయని, వాటిని వేదాల నుండి తీసుకొని రాశారని తెలిపారు. బౌద్ధాన్ని ఈ దేశం నుండి తరిమేటప్పుడు, మనుధర్మాలను కూడా ఆయా దేశాలలో ప్రచారం చేశారని, అందుకే ఇండోనేషియా, నేపాల్, శ్రీలంకల్లో మనుధర్మం ఆనవాళ్లు కనిపిస్తాయ న్నారు. వర్ణ వివక్ష, కులాలను ఏర్పాటు చేసింది మను ధర్మమేనని అన్నారు. శివాజీకి పట్టాభిషేకం చేసినప్పుడు శూద్రుడన్న కారణంతో బ్రాహ్మణుడు కాలి వేలితో అతనికి బొట్టు పెట్టారని గుర్తు చేశారు. కులాలకు కారణం మను ధర్మశాస్త్రమేనన్నారు. చట్టం ముందు అందరూ సమాన మేనని రాజ్యాంగంలో ఉందని, దీన్ని బీజేపీ ప్రభుత్వం మార్చాలని చూస్తున్నదని విమర్శించారు. అందువల్ల మనుధర్మాన్ని తగలబెట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. డీహెచ్‌పీఎస్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడు డీసీహెచ్ రాజబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడారు. సదస్సు కొన్ని తీర్మానాలు చేసింది. కార్యక్ర మంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సీపీఎం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఆర్‌పీఐ జాతీయ నాయ కులు బొడ్డు కల్యాణ్‌రావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వి.శివప్రకాశ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.సుబ్బన్న, ఎస్.రాజులు, జి.రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు సీఎం నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం సీఎం జగన్ తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'దళిత డిక్లరేషన్'ను మేనిఫెస్టోలో పెట్టాలి: డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర-విజయవాడ: అన్ని రాజకీయ పార్టీలు దళిత డిక్లరేషన్‌ను మేనిఫెస్టోల్లో పెట్టాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్‌కు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో దళితుల సామాజిక, ఆర్థిక సంక్షేమం కోసం డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప సమితి తరుపున 'దళిత డిక్లరేషన్' ప్రకటించారు. శతాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ, సామాజిక వివక్షతలకు, వెనుకబాటుతనానికి గురైన దళిత వర్గాల ప్రజలు సమాన అవకాశాలతో స్వాతంత్ర్య ఫలాలను పొందాలనే రాజ్యాంగస్ఫూర్తికి దేశంలో ఉన్న ప్రతి రాజకీయ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో దళిత డిక్లరేషన్ అంశాలను పొందుపరచి అధికారం లోకి రాగానే చిత్తశుద్ధి, పట్టుదలతో సమాజ మార్పునకు కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించి ఆయా వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి, ఉపాధికి వినియోగించాలన్నారు. భూమి కొనుగోలు పథకాన్ని పునరుద్ధరించి ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాలు వ్యవసాయ భూమిని అందించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి 2009లో చేసిన సవరణలను పక్కాగా అమలు చేయాలన్నారు. రూ.10లక్షలు పరిహారాన్ని తక్షణం బాధిత కుటుంబానికి అందజేయాలని డిమాండ్ చేశారు. నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకూడదన్నారు. డీఎస్పీని విచారణాధికారిగా కొనసాగించాల న్నారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రిజర్వేషన్లు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, చదువుకున్న దళిత నిరుద్యోగికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, దళితులు పోరాడి సాధించుకున్న సంక్షేమ పథకాలను తిరిగి సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

సీఏఏను వ్యతిరేకించండి

లౌకిక రాజ్యానికి బీజేపీ తూట్లు: సీపీఎం

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రజల మధ్య చిచ్చుపెట్టే సీఏఏను వ్యతిరేకిం చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో సీఏఏను వ్యతిరేకిస్తూ పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, బీజేపీ నేతలు దేశద్రోహులని, సీఏఏను ఎన్నికల ముందు తీసుకువచ్చి ఐకమత్యంగా ఉన్న ప్రజల మధ్య అగ్గి రాజేసేందుకు పూనుకున్నారని విమర్శించారు. లౌకిక రాజ్యానికి బీజేపీ తూట్లు పొడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఏఏను సమర్థిస్తూ మాట్లాడడం దారుణమని అన్నారు. బీజేపీకి తొత్తులుగా వ్యవహరి స్తున్న వైసీపీ, టీడీపీలను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటానికి ప్రజలు పూనుకోవాలని అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ఎం.సూర్యారావు, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, వై.నేతాజీ, కె.నళినికాంత్, ఎం.రవి, ఎన్.భవన్నారాయణ, ఎస్ఎస్.చంగయ్య, సీనియర్ నేత జొన్న శివశంకరరావు, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల అవినీతిలో బీజేపీది అగ్రభాగం

ఎన్నికల బాండ్ల అవినీతిలో బీజేపీది అగ్రభాగమని శ్రీనివాసరావు ఆరోపిం చారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో చెప్పేరే గాని ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో వివరంగా చెప్పడం లేదని విమర్శిం చారు. ఇదో పెద్ద అవినీతి కుంభకోణం అన్నారు. వైసీపీ, టీడీపీలకు ఏ కంపెనీ ఎంత ఇచ్చిందో ఆయా పార్టీలు స్వచ్ఛందంగా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వేల కోట్లు అవినీతి జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీకి రూ.337 కోట్లు, టీడీపీకి రూ.218 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చినట్లుగా చెప్పారని అన్నారు. రాష్ట్రంలో ఇండియా వేదిక ద్వారా కమ్యూనిస్టు పార్టీలు అవగాహనతో పోటీ చేస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో చర్చలు జరుపుతున్నామని రెండు మూడు రోజుల్లో ఒక కొలిక్కి వస్తాయని తెలిపారు. మంగళగిరిలో సీపీఎం పోటీ చేస్తుందని అన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి

చొరవ చూపండి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించటానికి పూర్తిచొరవ చూపాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నేతృత్వంలో సభ్యుల బృందం శనివారం లోకేశ్‌ను కలిసింది. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, సుమారు 10 లక్షల మందికి 3,080 కోట్ల రూపాయలు డిపాజిట్ల సొమ్ము చెల్లించవలసి ఉందని తెలిపారు. కంపెనీకి చెందిన వేల కోట్ల ఆస్తులు జప్తు చేయబడినప్పటికీ, బాధితులకు న్యాయం జరగక పోవటం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎక్స్‌గ్రేషియో రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి, ఒక్కరికీ చెల్లించ లేదన్నారు. ఇప్పటికీ ప్రతి నెల నలుగురైదుగురు అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్లు ఆత్మహత్యలకు పాల్పడటం, గుండెపోటుతో చనిపోతున్నారని

లోకేశ్‌కు వివరించారు. స్పందించిన లోకేశ్... రాబోయే తమ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తిన్యాయం చేసేలా తగిన కార్యాచరణ చేపడుతుందని హామీ ఇచ్చారు. ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రం, కే.పెదరామయ్య, ఎస్‌కే షరీఫ్, భాస్కరరావు, చక్రధర్‌బాబు, పేర్ల కృష్ణ, గౌరీశంకర్, నజుల్లా లోకేశ్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

గజ్జల వెంకటలక్ష్మి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గజ్జల వెంకటలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న వాసిరెడ్డి పద్మ ఇటీవల ఆమె తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆమె స్థానంలో గజ్జల వెంకటలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, మహిళల సాధికారతకు, భద్రతకు, మహిళాభ్యున్నతికి శాయశక్తులా పాటుపడతానని చెప్పారు. మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానన్నారు. తనను చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సామాజికవేత్త కె.వసుంధర, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కమిషన్ సెక్రటరీ డి.లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కట్టుదిట్టం

కలెక్టర్లు, ఎస్పీలకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టు దిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడ లోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన 24 గంటలులోగా ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల గోడ రాతలు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ తొలగించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లో రాజకీయ పరమైన అడ్వర్‌టైజ్‌మెంట్లు తొలగిం చాలని అన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్ని రకాల అడ్వర్‌టైజ్ మెంట్లను నిలిపివేయాలని సూచించారు. ప్రభుత్వ వెబ్ సైట్‌లు, కార్యాలయాల్లో ప్రధాని, సీఎంతో సహా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలను వెంటనే తొలగించాల న్నారు. ఎన్నికల ప్రకటన వచ్చాక మంత్రు లెవరూ అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారం వినియోగించరాదని సీఎస్ స్పష్టం చేశారు. వీరి ఎన్నికల పర్యటనలకు ప్రభుత్వ అతిథి గృహాలను కేటాయించరాదని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించే వాటర్ ట్యాంకులు, అంబులెన్సులపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఫొటోలు తీసివేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరూ తన అనుమతి లేకుండా తమతమ హెడ్ క్వార్టర్ విడిచి వెళ్లడానికి, ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందిని బదిలీ చేయడానికి వీలులేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఏరాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా, ఆయా పార్టీలు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, గిఫ్టులు, ఇతర లబ్ధి పొందినా అలాంటి వారిపై సీసీఏ నిబంధనలు ప్రకారం ఐపీసీ సెక్షన్ 171 మరియు 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 123,129,134,134 ఎ నిబంధనలు ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. నూతన ప్రాజెక్టులు, పథకాల మంజూరు, గ్రాంట్లు, హామీలు, శంకుస్థాపనలు పూర్తిగా నిషేధమని చెప్పారు. పనులు పూర్తయిన వాటికి నిధులు విడుదలలో ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. పీఎం, సీఎం సహాయ నిధి కింద గుండె, కిడ్నీ, క్యాన్సర్ వంటి రోగుల చికిత్స కోసం సకాలంలో నిధులు మంజూరుకు ఆయా శాఖలకు ఎలాంటి అభ్యంతరం లేదని జవహర్ రెడ్డి వెల్లడించారు.

ఏయూపై విదేశీ విద్యార్థుల మక్కువ

ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్



విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) జోనల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అత్యధిక శాతం మంది విదేశీ విద్యార్థులు ఏయూలో చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఏయూలో కల్పిస్తున్న వసతులు, బోధన తదితర అంశాలను వారిని ఆకట్టుకుంటున్నాయన్నారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విదేశీ విద్యార్థుల సంఖ్యను 2 వేలకు పెంచడం లక్ష్యంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఏయూకు పెద్దసంఖ్యలో విదేశీ విద్యార్థులను పంపే ప్రక్రియలో సహకారం అందిస్తున్న ఐసీసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ నాక్ స్కోరింగ్‌లో 3.74 సీజీపీఏ సాధించి దేశంలోనే అత్యుత్తమ రెండు వర్సిటీలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ ర్యాంకింగ్ రానున్న ఏడు సంవత్సరాలకు కొనసాగుతుందన్నారు. ఇది వర్సిటీకి మరింత ఎక్కువ మంది విదేశీ విద్యార్థులు రావడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, అసోసియేట్ డీన్ ఆచార్య ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురావస్తు సంపదను కాపాడుకుందాం

పురిటిగడ్డలో బయల్పడిన మూడో శతాబ్ది బ్రహ్మీ శాసనం

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం పురిటిగడ్డలో క్రీస్తుశకం మూడో శతాబ్దికి చెందిన బ్రహ్మీ శాసనం బయల్పడిందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, పురిటిగడ్డలోని పోతురాజు దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా విగ్రహాన్ని జాగ్రత్తగా తీసి పరిశీలించగా, ఓ పక్కన అక్షరాలు ఉన్నాయని అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ, పీజీటీ డాక్టర్ ఉమా సరస్వతి తనకు సమాచారం అందించారని చెప్పారు. ఆ శాసనాన్ని కేంద్ర పురావస్తు శాఖ శాసన విభాగ సంచాలకులు డాక్టర్ కె. మునిరత్నంరెడ్డికి పంపానని తెలిపారు. శాసనాన్ని పరిశీలించి అది క్రీస్తుశకం మూడో శతాబ్ది(ఇక్ష్వాకుల) నాటి ప్రాకృత భాష బ్రాహ్మీ లిపిలో ఉందని, ఆనందుడనే ఒక బౌద్ధాచార్యుడు ఆ శిలాఫలకాన్ని ప్రతిష్ఠించినట్టు ఉందని, శాసన ఫలకం పగిలి కొన్ని అక్షరాలు పోయినందున పూర్తి వివరాలు తెలియటం లేదని మునిరత్నంరెడ్డి తనకు చెప్పారన్నారు. ఈ పల్నాటి సున్నపురాతి ఫలకంపై ఎదురుగా పోతురాజు విగ్రహం, ఒకపక్క పైశాసనం, మరోపక్క ఇద్దరు బిడ్డలతో ఉన్న తల్లి విగ్రహం ఉన్నాయని, ఇవి కీస్త్రుశకం 18వ శతాబ్దం నాటివని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ శాసన ప్రతిబింబాన్ని పోతురాజు దేవాలయం వద్ద ప్రదర్శించి భావితరాలకు తెలియజేయాలని గ్రామస్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల అక్రమాలపై స్పందించండి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున ఎన్నికల అక్రమాలపై ప్రజలు స్పందించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. అక్రమాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250264కు, వాట్సాప్ 8790005577కు ఫిర్యాదు చేయాలని కోరారు. రాజకీయ పార్టీల తరపున ప్రచారం చేసే ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లపై కఠిన చర్యలు తీసుకునేలా ఎన్నికల అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు నిష్పక్షపాతంగా వ్యవహరిం చాలని, దీనికి భిన్నంగా ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవ హరిస్తే ఐపీసీ సెక్షన్ 171, 123 తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 134, 134(ఎ) సెక్షన్ కింద చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. దీనిని వలంటీర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశా లకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి ఎన్నికల విధులను పరిమితంగా అప్పజెప్పాలని, వలంటీర్లను పూర్తిగా ఎన్నికలకు దూరంగా ఉంచాలని కోరారు. ప్రభుత్వ భవనాలు, ఆస్తులపై ఉన్న రాజకీయ నేతల కటౌట్స్, బ్యానర్లు, జెండాలను తొలగించాలని కోరారు. చర్చిలు, దేవాలయాలు, మసీదులలో ఎన్నికల ప్రచారం జరపరాదని, డబ్బులు, మద్యం వంటి ప్రలోభాలతో ఓటర్లను ప్రభావితం చేయరాదని అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. తమ దృష్టికి తెచ్చిన అక్రమాలను సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకుని వెళతామని పేర్కొన్నారు.

సంపాదకీయం

మోగిన ఎన్నికల నగారా

లోక్‌సభకు, నాలుగు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ ఖరారు చేయడంతో దేశ వ్యాపితంగా ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు వివిధ రాష్ట్రాలలోని 26 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. జూన్ 16వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేస్తామని ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు 43 రోజుల వ్యవధిలో ఏడు దశల్లో నిర్వహిస్తారు. జమ్ము-కశ్మీర్‌లో ఈసారి కూడా కేవలం లోక్‌సభ ఎన్నికలు మాత్రమే నిర్వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న జమ్ము-కశ్మీర్‌లో ఆరేళ్లగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. అక్కడ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించబోమని రాజీవ్ కుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ ఏడాది సెప్టెంబర్ 30లోపు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. మొదటి దశలో 21 రాష్ట్రాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు, రెండో దశలో 13 రాష్ట్రాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు, మూడో దశలో 12 రాష్ట్రాల్లోని 94 లోక్‌సభ స్థానాలకు, నాలుగో దశలో 10 రాష్ట్రాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు, ఐదో దశలో 8 రాష్ట్రాల్లోని 49 లోక్‌సభ స్థానాలకు, ఆరో దశలో 7 రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాలకు, ఏడో దశలో 8 రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇలా ఏడు దశల్లో మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది. ఈసారి వేసవితాపంతోపాటు హోరాహోరి ఎన్నికల పోరు తీసుకువచ్చే రాజకీయ వేడిని జనం చవిచూడక తప్పదు. ఎన్నికల్లో వివిధ పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రజల వాస్తవ ప్రయోజనాలను విస్మరించి వాటిని సమాధి చేసేందుకు ప్రయత్నిస్తాయన్న విషయంలో ఎట్టి అనుమానం ఉండనవసరం లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ, అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ తదితర అంశాలను రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీ లబ్ధి కోసం అనుకూలంగా మలుచుకొనే ప్రయత్నాలు ప్రారంభించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతిపక్షాలు మోదీ ప్రయత్నాలను తిప్పికొట్టే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించవలసి ఉంది. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాలి. దళితులు, రైతులు, సమాజంలోని అణగారిన వర్గాలలో పెల్లుబికిన ఆగ్రహాన్ని ఓట్లుగా మలచుకోవాలి. ప్రతిపక్షం ఐక్యంగా చర్చించి సమష్టి వ్యూహంతో వ్యవహరించకపోతే మోదీ దుష్పరిపాలనకు చరమగీతం పాడటం కష్టమన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌లో ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ ఇంకా సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తిచేయలేదు. ఇప్పటికైనా ఆ క్రమాన్ని త్వరగా పూర్తిచేసి ఎన్నికల కదనరంగంలోకి దూకాల్సిన అవసరం ఎంతో ఉంది. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడచిన తొమ్మిదేళ్ల పదిమాసాల్లో పెరిగిన నిరుద్యోగం, చుక్కలనంటిన నిత్యావసరాల ధరల తగ్గింపు, నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడంలో విఫలం, అమలుకాని ఎన్నికల హామీలు, దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడం, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొన్న అష్టకష్టాలను ప్రధానాంశాలుగా ప్రతిపక్షాలు విస్తృతంగా ప్రచారం చేయాలి. కేంద్రంలో తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి సంఘపరివార్, బీజేపీ శక్తులు విశ్వప్రయత్నాలు చేస్తాయన్న విషయాన్ని ప్రతిపక్షాలు విస్మరించరాదు. మరోసారి మోదీకి అవకాశం దక్కకుండా ప్రతిపక్ష పార్టీలు ప్రత్యేకించి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి వ్యూహరచనతో ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలి. మోదీ ప్రభుత్వానికి జాతీయ ప్రత్యామ్నాయాన్ని దేశ ప్రజల ముందు ఉంచేందుకు కృషి చేయాలి. దేశవ్యాపితంగా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న 1.82 కోట్ల మంది యువత విశ్వాసాన్ని చూరగొనేలా ప్రతిపక్ష పార్టీలు కార్యక్రమాన్ని రూపొందించవలసిన అవసరముంది. ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని తదనుగుణంగా చర్యలు చేపట్టేందుకు ఉపక్రమించాలి. విద్వేషాలు రెచ్చగొట్టి, వ్యాపింపచేసే విచ్ఛిన్నకర ప్రభుత్వం కింద మగ్గడం కొనసాగాలా? లేక సామరస్య పరిస్థితుల్లో జీవించాలా? అన్నది దేశ ప్రజల ముందు ప్రస్తుతమున్న ప్రశ్న. న్యాయమైన, పారదర్శక పాలన ప్రజలకు అవసరం ఉంది. మోదీ ప్రభుత్వ పాలనలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకి తగిన గుణపాఠం చెప్పడానికి ఓటర్లు సంసిద్ధులు కావాలి.

స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించడమనేది కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ విధి. ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడం వల్ల కొంత మేలు ఉన్నప్పటికీ లోపాలు కూడా లేకపోలేదు. సున్నిత నియోజకవర్గాల్లో, ఎన్నికల సంబంధ హింసాకాండ చోటుచేసుకొనే అవకాశమున్న పోలింగ్ కేంద్రాల్లో తగిన సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించడానికి ఏడు దశల్లో ఎన్నికల నిర్వహణ దోహదపడుతుంది. 85 ఏళ్ల వయసు పైబడిన వారందరూ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 85 ఏళ్ల వయసు పైబడిన ఓటర్లు దేశవ్యాప్తంగా 82 లక్షల మంది ఉన్నట్లు రాజీవ్ కుమార్ తెలిపారు. ఇందులో 40 శాతం మంది ఓటర్లు దివ్యాంగులు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద వలంటీర్లు సహాయం చేస్తారని, వీల్ చైర్లు, రవాణా సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇక వందేళ్లు దాటిన ఓటర్లు 2 లక్షల 18 వేల మంది ఉన్నారు. మాజీ ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ చెప్పినట్లుగా దశ మహాపాతకాలు దేశ ఎన్నికల వ్యవస్థను కరకరా నమిలేస్తున్నాయి. నీరు విడిచిన చేపైనా బతుకుతుందేమోగానీ, అక్రమ ధనప్రవాహాలు వెల్లువెత్తనిదే ఓట్ల పండగ గడవదని పదేపదే నిరూపితమవుతోంది. రాజకీయాధికారాన్ని ఒడిసిపట్టే క్రమంలో ప్రలోభాల ఎరలు వేయడానికి, ధన భుజబల మదోన్మత్త శక్తులను వినియోగించి రకరకాల అకృత్యాలకు తెగబడటానికి పార్టీలు, అభ్యర్థుల పోటాపోటీని పరికించి భారత జనస్వామ్యం నివ్వెరపోతోంది. ధన, మద్యం ప్రవాహాలు, ప్రలోభాల ప్రభావాల పీడ విరగడకాకుండా ఎన్ని సార్వత్రికాలు నిర్వహించినా సగటు మానవుడికి జరిగేది, ఒరిగేది ఏముంది? అధికారపీఠంపై వ్యక్తులు మారడం తప్ప సామాన్య ప్రజల బతుకులు బాగుపడనప్పుడు 'ప్రజాస్వామ్య కుంభమేళా'ల ఆర్భాటాల వల్ల కలిగే ప్రయోజనం శూన్యం.

దేశ భావిగతిని సవ్యంగా, సజావుగా నిర్దేశించాల్సిన పార్టీలు సంకుచిత రాజకీయ లబ్ధి వేటలో తలమునకలవుతున్నట్లు గ్రహించాకనైనా ఓటర్లు జాగురూకులు కావాలి. గెలుపు గుర్రాల్ని ఏరికోరి అక్కున చేర్చుకుంటున్న వారిని, నేరగాళ్లే తమ పార్టీకి జవసత్వాలని భావించే వారిని, ప్రజాస్వామ్య విలువలకు తలకొరివి పెడుతున్న అభ్యర్థులను ఓటర్లు నిష్కర్షగా తిరస్కరించినప్పుడే పాలనా వాసి మెరుగుపడుతుంది, చట్టసభలు తేటపడతాయి. ఎన్నికలు న్యాయంగా, సక్రమంగా నిర్వహించడంపై ఎన్నికల సంఘం నిఘా పెట్టాలి. స్వతంత్రంగా వ్యవహరించి రాజ్యాంగ విలువలను, దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టటం అతిముఖ్యం.

దేశంలో దారుణ నిరంకుశపాలన

రాడ్రిగొలిను

ప్రపంచంలో అత్యంత దారుణమైన నిరంకుశ పాలనలో 42 దేశాలున్నాయి. వీటిలో భారతదేశం ఒకటని స్వీడన్ గొథెన్‌బర్గ్ నగరం నుంచి పనిచేస్తున్న వి-డెమ్ సంస్థ సర్వే 2024 మార్చి 12న 2023 వార్షిక నివేదికను వెల్లడించింది. ఈ సంస్థ గత ఎనిమిదేళ్లుగా అధ్యయన నివేదికలను విడుదల చేస్తోంది. 1789 నుంచి 2023 వరకు 202దేశాలలో ప్రజాస్వామ్య సమాచారం సేకరించిన విషయాలు క్రోడీకరించి ప్రకటించారు. మనదేశంలో ప్రజాస్వామ్యం దారుణంగా దిగజారిపోయి, నిరంకుశ పాలన సాగుతోందని ఆ నివేదిక పేర్కొంది. 2023లో 71శాతం అంటే 5.7బిలియన్ ప్రజలు నిరంకుశపాలనా దేశాలలో నివసిస్తున్నారు. దశాబ్దం క్రితం 48శాతం ఉండగా, ఇప్పుడు గణనీయంగా పెరిగింది. ప్రజాస్వామ్య దేశాలు 18మాత్రమే ఉన్నాయి. అంటే 5శాతం ప్రజలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తున్నారు.

దాదాపు అన్ని విధాలైన ప్రజాస్వామ్య అంశాలు భావప్రకటనా స్వేచ్ఛ, అవకతవకలులేని ఎన్నికలు, సంఘం ఏర్పాటు, పౌరసమాజం, స్వేచ్ఛలాంటి అంశాలలో నిరంకుశత్వం అత్యధికంగా ఉంది. 42దేశాలలో ప్రజాస్వామ్యం రోజురోజుకీ దిగజారిపోతోంది. వీటిలో భారతదేశం ఒకటి. ప్రత్యేకించి 2018 నుంచి భారతదేశంలో "ఎన్నికల నిరంకుశత్వం" పెరిగిపోతోంది. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించిన నాటి నుంచి "ఉదారవాద ప్రజాస్వామ్యం" తిరోగమనం పట్టింది. ప్రస్తుతం ఉన్న బీజేపీ ప్రభుత్వంలో దాదాపు పదేళ్లుగా భావప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వతంత్రత, పౌర స్వేచ్ఛ మరింత దిగజారిపోతున్నది. అసమ్మతిని అణచి వేసేందుకు, దేశద్రోహనేరం, పరువు నష్టం, టెర్రరిజానికి సంబంధించిన చట్టాలను చాలా సులువుగా ఉపయోగిస్తూ అమాయకులనూ శిక్షిస్తున్నారు. మతస్వేచ్ఛను, రాజకీయ ప్రత్యర్థులను అన్ని విధాలుగా బెదిరించడం, విద్యారంగంలో మేధావుల నోరుమూయించటం వంటి చర్యలు నేటి ప్రభుత్వం నిరంతరం చేస్తోంది.

ప్రపంచంలో ఉదారవాద ప్రజాస్వామ్యదేశాలు 32, ఎన్నికల ప్రజాస్వామ్య దేశాలు 59, ఎన్నికల నిరంకుశ దేశాలు 55, అంతర్గత నిరంకుశ దేశాలు 33 ఉన్నాయి. నిరంకుశ దేశాల ధోరణి మరింతగా పెరిగిపోతున్నది. తూర్పు ఐరోపా, ఆసియా దేశాలలో ప్రజాస్వామ్య స్థాయి దిగజారిపోతున్నది. 1990 నుంచి తూర్పు ఐరోపాలో సగటుమనిషి అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం బాగాపడిపోయింది. సోవియట్ యూనియన్ పతనంకాక ముందు నుంచే ఈ పరిస్థితి ఉన్నదని వి-డెమ్ సంస్థ గుర్తించింది. రష్యా, బెలారస్, నిరంకుశత్వం మరింత పెరుగుతున్నదని చెప్పడానికి ఉదాహరణ. హంగరి, సెర్బియా, క్రొయేషియా, రుమేనియా నింకుశంవైపు దారితీస్తోంది. ఆసియాలో ప్రజాస్వామ్యస్థాయి వేగంగా పడిపోతోంది. 1975 తరువాత భారతదేశంలో ప్రజాస్వామ్య ముసుగులో నిరంకుశత్వం బాగా అధికమైంది. లాటిన్ అమెరికా దేశాలలో ప్రజాస్వామ్యస్థాయి సగటు మనిషి గత ఏడాదిగా ఎక్కువగా అనుభవిస్తున్నాడు. బ్రెజిల్, బొలీవియా, హోండురస్ దేశాలలో ఇటీవల ప్రజాస్వామ్య స్థాయిలు పెరిగాయి. పెద్ద దేశాలలో ప్రజాస్వామ్యస్థాయి పెరుగుతుండగా, చిన్నదేశాలలో నిరంకుశత్వం అధికమవుతోంది.

ప్రపంచంలోని ఇతరప్రాంతాలలో-సబ్‌సహారా, ఆఫ్రికాలో ప్రజాస్వామ్య స్థాయిలు 2000 సంవత్సరంలో ఉన్నట్లుగానే దాదాపు ఉన్నాయి. తూర్పుఆసియా, పసిఫిక్ ప్రాంతం, మధ్య ఆసియా, ఉత్తరాఫ్రికా, పశ్చిమ ఐరోపా, ఉత్తర అమెరికా ప్రాంతాలలో ప్రజాస్వామ్యస్థాయి రెండేళ్లుగా నిలకడగా ఉంది. గత దశాబ్దికాలంగా జనాభా తగ్గుతున్న దేశాల సంఖ్య పెరుగుతున్నాయి. అన్ని రకాల ప్రజాస్వామ్యం దాదాపుగా ఎక్కువ దేశాలలో అధ్వాన్నంగా తయారవుతోంది. భావప్రకటనా స్వేచ్ఛ, ఎన్నికల ప్రజాస్వామ్యం ఎక్కువగా దిగజారుతోంది. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికల నిర్వహణ స్వభావం దిగజారుతోంది. ఇటీవల ఎన్నికలు జరిగిన బంగ్లాదేశ్, ఈజిప్టు, వెనిజులా దేశాలలో అంతగా స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగలేదు. 2024లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60దేశాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 31దేశాలలో ప్రజాస్వామ్యస్థాయిలు దారుణంగా ఉన్నాయి. రానున్న కాలంలోనూ ఈ దేశాలలో ప్రజాస్వామ్యస్థాయి ఏ మాత్రం పెరిగేసూచనలు లేవు.

చట్టసభల్లో ముస్లింల ప్రాతినిధ్యం ఏది?

గిరీష్ లింగన్న

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లిం సభ్యులు 76 మంది ఎన్నికయ్యారు. దామాషా పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో ముస్లిం ఎంపీలు గణనీయంగా ఎన్నిక కాగా, ఆనాడు ముస్లింల జనాభా 6 శాతం కంటే తక్కువగా ఉన్నారు. మొదటి రాజ్యసభలో 10.5 శాతం కంటే కొద్దిగా ఎక్కువ ముస్లిం సభ్యులున్నారు. ముస్లింలే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సైతం దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగినప్పుడు సెక్యులర్ పార్టీలతో సహా ఏ పార్టీ కూడా ముస్లిం సభ్యులను ఎక్కువగా పోటీపెట్టలేదు. 1980లో నేరుగా ఎన్నికలు జరిగినప్పుడు 49 మంది ముస్లింలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎప్పుడూ ముస్లింల బలానికి తగినంత మంది పార్లమెంట్‌కు ఎన్నిక కాలేదు. 2014 లో బీజేపీ స్వల్ప మెజారిటీతో పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా కనీసం ఒక ముస్లిం కూడా ఎన్నిక కాలేదు. బీజేపీ అధికారానికి వచ్చిన నాటి నుంచి ముస్లింల ప్రాతినిధ్యం అత్యల్పం. మెజారిటీ ముస్లిం జనాభా ఉన్న నియోజక వర్గాల్లో ముస్లింలు ఎన్నిక కాలేదు. హిందూత్వ బీజేపీ మెజారిటీ జనాభా ప్రాతిపదికగా అధిక సీట్లు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో 2024 లో జరగనున్న 18వ లోకసభ ఎన్నికల్లో హిందూత్వ మెజారిటీ జనాభాతో బీజేపీ చెలరేగిపోతున్నందున ముస్లింలంతా ఏకం కావచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. హిందూ జాతీయవాద ప్రభుత్వం ముస్లింలను అణచివేస్తున్నందున ముస్లింలు ఏకమై సెక్యులర్ పార్టీలకు ఓట్లు వేస్తారని ఫిబ్రవరిలో ఒక పరిశోధనా పత్రం పేర్కొంది. బీజేపీపై పోటీ చేస్తున్న బలమైన అభ్యర్థికి ఓట్లు వేస్తారని ఆ పరిశోధన అంచనా వేసింది. 2019 పార్లమెంట్ ఎన్నికల తర్వాత జరిగిన అసెంబ్లీల ఎన్నికల్లో ముస్లింల ఎన్నికల ధోరణిని విశ్లేషించినప్పుడు ఈ ముస్లింలు ఏకమవుతారన్న అంచనాకు వచ్చారు.

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 27 మంది ముస్లిం అభ్యర్థులు గెలవగా (17 వ లోక్‌సభ), 16 వ లోక్‌సభలో 23 మంది ముస్లిం సభ్యులున్నారు. పార్లమెంటు చరిత్రలో ఇది ముస్లింలు తక్కువ సంఖ్య ఉన్న

రెండో సభ. ప్రపంచంలో భారత్‌లో మూడవ అతిపెద్ద ముస్లిం జనాభా (172.2 మిలియన్లు) ఉంది. 2011 జనాభా గణాంకాల ప్రకారం ఉన్న సంఖ్య. 2001 లో 13.4 శాతం, 2011 నాటికి 14.2 శాతం ముస్లిం జనాభా ఉంది. 2024 సార్వత్రికల్లో బీజేపీ అభ్యర్థుల్లో ముస్లిం అభ్యర్థి ఒక్కరే పోటీ చేస్తున్నారు. కేరళలో ముస్లింలు అధికంగా ఉండే మలప్పురం నియోజకవర్గం నుంచి ఎం.అబ్దుల్‌సలాం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన గతంలో కాలికట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పని చేశారు. బీజేపీ తరపున సలాం పోటీ చేయడం ఇది రెండవసారి. 2021 లో ఆయన మలప్పురం ప్రాంతంలోని తిరూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా శాసనసభ ఎన్నికలలో పోటీ చేశారు. భారత్‌లో దాదాపు 50 పార్లమెంటరీ నియోజక వర్గాల్లో ముస్లిం ఓటర్లు 30 శాతానికి పైగా ఉన్నారు. అయినప్పటికీ ఎక్కువ నియోజక వర్గాల్లో హిందు అభ్యర్థులే గెలుపొందారు. దేశంలో ముస్లిం జనాభా కొన్ని రాష్ట్రాలలో అత్యధికంగా ఉన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లో ఉన్నారు. ఈ రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. 2011 జనాభా గణన ప్రకారం 38.4 మిలియన్‌ల ముస్లిం జనాభా ఉన్నది. రాష్ట్ర జనాభాలో ఐదోవంతు ముస్లింలు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో పశ్చిమ బెంగాల్‌లో 24.6 మిలియన్‌ల ముస్లింలు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో ఈ సంఖ్య 27 శాతం. బీహార్, అసోంలలో గణనీయంగా ముస్లింలు ఉన్నారు.

దక్షిణాది రాష్ట్రాలలో కేరళ, కర్నాటకలలో ముస్లింలు గణనీయంగానే ఉన్నారు. జమ్ము కశ్మీర్, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాల్లో ముస్లింలు మెజారిటీగా ఉన్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో గణనీయంగానే ముస్లింలు ఉన్నారు. వామపక్షాలు, సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు ఉన్న యూపీలో, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ముస్లింలు అధికంగా ఉన్నారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారు. కేరళలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ మధ్య ముస్లిం ఓట్లు చీలుతాయి. అలాగే ఉత్తరప్రదేశ్‌లోను కాంగ్రెస్, ఎస్‌పి, బీఎస్‌పీలకు ముస్లింలు ఓట్లు ఎక్కువగా వేస్తారు. అనేక సందర్భాలలో వివిధ సెక్యులర్ పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నెలకొని ఉంది. ముస్లిం ఓటర్లు కూడా ఆయా పార్టీలకు ఓట్లు వేస్తున్నారు.

2004 లో దౌత్యాధికారిగా పనిచేసిన సయ్యద్ సహబుద్దీన్ ప్రస్తుతం రాజకీయ నాయకుడిగా ఉన్నారు. దౌత్యాధికార సంస్థ మీడియా ప్రకారం జాతీయ, ప్రాంతీయ పార్టీలు సెక్యులర్‌గా ఉన్నప్పటికీ ముస్లిం అభ్యర్థులకు ముస్లింలు కాని ఓటర్లు ఓట్లు వేయడంలేదు. అలాగే ముస్లింలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలలోనూ ముస్లిం అభ్యర్థులకు ఓటు చేయకపోవటం పెద్ద లోపంగా ఉంది. అయితే 2004లో 36 మంది ముస్లిం ఎంపీలు ఎన్నిక కాగా, 28 నియోజక వర్గాల్లో గణనీయంగా ముస్లిం జనాభా ఉన్నది. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయంగా ముస్లింలు తృణమూల్ కాంగ్రెస్‌కి ఓటు చేశారు. ప్రస్తుత ఎన్నికల వాతావరణంలో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, ఎస్‌పి కూటమికి ముస్లింలు గణనీయంగా ఓటు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేశారు. బీఎస్పీ బలహీనమైంది గనక ఈ రెండు పార్టీల కూటమికే అత్యధిక ముస్లింలు ఓటు వేయనున్నారు. బెంగాల్‌లో 42 సీట్లకు గాను తృణమూల్ కాంగ్రెస్ ఆరుగురు ముస్లింలు పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చారు.

మతం, ఊతకర్రల్ని దోపుకుని వచ్చిన 'దేశభక్తి'

డాక్టర్ దేవరాజు మహారాజు

12 మే, 1940లో పశ్చిమబెంగాల్, ఝర్‌గ్రాంలో జరిగిన బహిరంగసభలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ ఈ దేశప్రజలను ఉద్దేశించి చెప్పిన మాటల్ని మనం ప్రస్తుత పరిస్థితుల్లో గుర్తు చేసుకోవాల్సి ఉంది.

"హిందూ మహాసభ తమ సన్యాసులను, సన్యాసినులను తెచ్చి, పెద్ద ఎత్తున రాజకీయాల్లో ప్రవేశపెట్టింది. వారు ఓట్లు అడుగుతూ తిరుగుతున్నారు. వారు కనబడగానే హిందువులంతా ఒక పవిత్ర భావనలకులోనై, శిరసువంచి నిలబడుతున్నారు. అది హిందూ మహాసభ వారికి బాగాఉపయోగపడుతూ ఉంది. హిందువులంతా ఈ విషయాన్ని ఖండించాలి. ఆధ్యాత్మిక వాదులకు రాజకీయాలతోనూ, ఓట్లతోనూ పనేమిటి? మత విశ్వాసాలు తెచ్చి రాజకీయాలకు పులమడం వల్ల ఇప్పుడేకాదు, రాబోయేకాలాలలో కూడా చాలా ప్రమాదాలు జరుగుతాయి. ప్రజలందరూ దీన్ని గుర్తించాలి. అప్రమత్తంగా ఉండాలి. ఏ మతమైనా సరే, దాని పరిధిలో దాన్ని ఉండనివ్వాలి. అతిక్రమిస్తే మాత్రం సహించకూడదు." దార్శనికుడైన నేతాజీ, ఎనభై యేళ్లకు ముందే నేటి సమకాలీన పరిస్థితిని పసిగట్టారు. 'అతిసర్వత్ర వర్జయేత్' అన్నది ఆర్యోక్తి.కానీ, వారు చెప్పిన దానికి విరుద్ధంగా వారే బ్రాహ్మణార్యులు, బ్రాహ్మణిజాన్ని నెత్తిన మోస్తున్న బ్రాహ్మణేతరులు కలిసికట్టుగా ఈ దేశంలో అతిగా ప్రవర్తించారు. ఇప్పటికీ ప్రవర్తిస్తున్నారు. ఒకప్పటి హిందూ మహాసభ ఇప్పుడులేదని అనుకోవద్దు. ఆర్ఎస్ఎస్-బీజేపీలు దాని శాఖలే!

సీఎన్ఎన్-పోల్ ప్రపంచంలోని అత్యత అవినీతి మయమైన పది రాజకీయ పార్టీల జాబితాను విడుదల చేసింది. అందులో మన దేశంలోని అధికార పార్టీ భారతీయ జనతాపార్టీకి నాలుగో స్థానం లభించింది. ఈ లిస్ట్‌లో పాకిస్థాన్ ముస్లింల లీగ్-నవాజ్‌కు పీఎమ్ఎల్ఎస్(ఎన్) మొదటిస్థానం, నేషనల్ రెసిస్టెంట్ మూవ్‌మెంట్, ఉగాండాకు రెండో స్థానం, ప్రోగ్రసివ్ యాక్షన్ పార్టీ క్యూబాకు మూడోస్థానం దక్కాయి. ఆ తర్వాత నాలుగోస్థానం పార్టీ ఆఫ్‌ఇటలీ వంటివి కూడా అవినీతి రాజకీయపార్టీల జాబితాలో ఉన్నాయి. దేశంలో బీజేపీ వారు చేస్తున్న అరాచక కార్యక్రమాలు రోజూ మీడియాలో చూస్తూనే ఉన్నాం. మీడియాను మోదీ ఎంతగా కొనేసినా ఇంకా నిజాలు నిర్భయంగా వెల్లడిస్తున్న వారుకొంతమందైనా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ఆయోధ్యలో అల్లర్లు సృష్టించిన ఏడుగురు బీజేపీ కార్యకర్తల్ని సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారు మహేశ్ కుమార్ మిశ్రా, ప్రత్యూష్ శ్రీ వాస్తవ, నితిన్‌కుమార్, దీపక్‌కుమార్ గౌడ్, బ్రిజేష్ పాండే, శతృఘ్న ప్రజాపతి, విమల్‌పాండే, వీరు ముస్లింల టోపీలు ధరించి ముస్లింల వేషధారణలో అయోధ్యలోని మసీదు వెలుపల అభ్యంతరకరమైన పోస్టర్లు అంటించారు. ఖురాన్ ప్రతుల్ని విసిరేశారు. ముస్లింలను నిందిస్తూ, ముస్లింలను దోషులుగా ప్రచారంచేస్తూ ముస్లింల వేషధారణలో అల్లర్లకు పాల్పడింది, బీజేపీ కార్యకర్తలేనన్నది స్పష్టమైంది.

గడ్డం పెంచుకున్నంత మాత్రాన ఎవరూ రవీంద్రనాథ్ టాగూర్ అయిపోరు. అలాంటప్పుడు మరి ఇతనేనా మన విజయవంతమైన ప్రధానమంత్రి? సర్దార్ పటేల్ విగ్రహానికి మూడువేల కోట్లుపెట్టాడు. కార్పొరేట్లకు అయిదు లక్షల యాభై అయిదు వేలకోట్లు రుణమాఫీ చేశాడు. ప్రధాని తన విదేశీ యాత్రలకు 25వేల కోట్లు బీజేపీ పార్టీ ఆఫీసుకి 350కోట్లూ, తమ పార్టీ వ్యాపార ప్రకటనలకు 500కోట్లు, ప్రధాని సెక్యూరిటీకి రోజూ కోటికి పైనే ఖర్చు చేస్తున్నాడు. సంవత్సరానికి మొత్తం సుమారు 591 కోట్ల 30లక్షల ఖర్చు వస్తూ ఉంది. గడచి ఐదేళ్లలో కుంభమేళాలకు 500కోట్లు, ట్రంప్‌కు నమస్కారం చెప్పడానికి 100కోట్లు ఖర్చుచేశాడు. ఇతని వల్లనేకదా ద్రవ్యోల్బణం పెరిగిందీ? ఇతని వల్లనేకదా పెట్రోల్, డీజిల్, గ్యాసు సిలిండర్ ధరలు ఊహించలేనంతగా పెరిగాయీ? గడచిన 30-40సంవత్సరాలలో ఏనాడూ ఇంతమంది సైనికులు చనిపోలేదు. ఈయనగారి అధ్వాన్నపు పాలన ఎలా ఉందో చెప్పడానికి ఇంకా ఎన్ని ఉదాహరణలు కావాలీ? అంటూప్రతిపక్షనేతలు పార్లమెంటులోనే అనేకసార్లు గగ్గోలుపెట్టారు. సంసద్ టీవి, ఇతర జాతీయ టెలివిజన్ ఛానళ్ల ద్వారా దేశప్రజలు అన్నీ గమనిస్తూ వచ్చారు. తమ 'మన్‌కి బాత్' అక్కడ ప్రతిపక్షాలు గొంతెత్తి చెపుతున్నాయని అనుకున్నారు. ప్రత్యక్షప్రసారం చేసింది సంసద్ టి.వియే గనక, అది అధికార ప్రకటననే అని దేశ ప్రజలు భావించారు!

కర్నాటకలో విద్వేష ప్రసంగాలకు బీజేపీ నాయకులు ఆజ్యం పోస్తున్నారు. కర్నాటక బీజేపీ చీఫ్ నళిన్ కుమార్ కాతిల్ "టిప్పు సుల్తాన్ అభిమానులు ఈ దేశంలో ఉండడానికి వీలులేదు. వారిని వెంటాడి వేటాడి చంపేయండి. లేదా అడవి ప్రాంతాలకు పారద్రోలండి. మనం హిందువులం శ్రీరాముడి భక్తులం!" అంటూ కర్నాటకలోని కొప్పాల్ జిల్లాలోని యెల్‌బుర్గాలో ఈ విద్వేష ప్రసంగం చేశారు. ఫలితంగా కర్నాటక ప్రజలు తమ తీర్పునిచ్చారు.

ఎవరిని పారద్రోలాలన్నది బహుశా వారికి తెలిసినట్టుంది! ఆంగ్లేయులను ఎదిరించి పోట్లాడిన భారతీయ పాలకుడు టిప్పుసుల్తాన్‌ను వీరు దేశద్రోహి అని అంటారు. ఎందుకూ? అంటే ముస్లిం రాజు కాబట్టి! ఆంగ్లేయులు బూట్లు నాకి క్షమాబిక్ష అడుక్కున్న సావర్కర్ వీరి దృష్టిలో గొప్ప దేశ భక్తుడు. ఎందుకూ? హిందూమహాసభ/ఆర్ఎస్ఎస్ /బీజేపీల సభ్యుడుగనక! గాంధీని హత్యచేసిన గాడ్సేకు వెనకున్నది సావర్కరేనన్న విషయం కావాలనే దాచి పెడతారు.

ఉత్తరప్రదేశ్ అమేథీకి చెందిన మహమ్మద్ ఆరిఫ్ కొన్నేళ్ల క్రితం

తన పొలంలో గాయపడి పడిపోయిన 'సారస్' రకం కొంగకు చిన్నపాటి కట్టుగట్టి వైద్యం చేసి కాపాడాడు. అలా ఆ కొంగ అతని దగ్గరే ఉండపోయింది. అటవీశాఖ అధికారులువచ్చి ఆకొంగను స్వాధీనం చేసుకుని సమస్‌పూర్ పక్షుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ ఆరిఫ్‌పై అధికారులు కేసు నమోదుచేయడం వివాదాస్పదమైంది. పక్షి ప్రాణాలు కాపాడినందుకు బీజేపీ ప్రభుత్వం ఆరిఫ్‌పై కేసుపెట్టింది. కారణం మరేమీ లేదు, అతను ముస్లిం కావడమే. అలా కేసులు పెడితే పెద్దపెద్ద వాళ్లమీదే పెట్టాలి. ప్రధాని మోదీ తన నివాసంలో నెమళ్లు పెంచుకుంటే కేసు ఉండాలికదా? అలాగే యూపీ ముఖ్యమంత్రి యోగి తన కార్యాలయంలో పనిచేస్తూ ఉండగా, ఆయన ఒళ్లో బుల్లి కోతి వచ్చి కూర్చుంటుంది. ఆయన దాన్ని ఆడిస్తూ ఉంటాడు. ఆయనమీద కేసు ఉండాలి కదా? వీళ్లు ఆ జంతువుల/పక్షుల గాయాలు మాన్పలేదు. ఆరోగ్యంగా ఉన్నవాటినే పెంచుకుని ఆడుకుంటున్నారు. అటవీచట్టం ప్రకారం, అడవి జంతువుల్ని బలవంతంగా ఇంట్లో కట్టిపడేసుకోవడం నేరం. ప్రాణాలు కాపాడి, ఆహారం పెట్టినందుకు ఓ కొంగ ముస్లిం యువకుడికి దగ్గరైంది. అంతే.. అది అతని పెంపుడు పక్షి కాదు. బలవంతంగా దాన్ని తన దగ్గర ఉంచుకోలేదు. విషయం క్షుణ్ణంగా పరిశీలించాక, దురుద్దేశంలో కక్షపూరితంగా కేసులుపెట్టడం నేటి బీజేపీ ప్రభుత్వానికి అలవాటైపోయింది. మెమరీ గార్బేజ్ ఈజ్ ఫుల్. క్లీన్..అంటూ తరచూ మనం మన మొబైల్‌లో ఒక మెసేజ్ చూస్తుంటాం కదా? అయితే అది, నేటి మన కేంద్ర ప్రభుత్వానికి కూడా పనికొచ్చేట్టుగా ఉంది! మన కేంద్ర ప్రభుత్వపు పోకడచూసే ఒక ఉరుదూ కవి ఇలా అన్నాడు. "ఓ చైన్ సె సోయీ రహే హై షహర్ బేచ్‌కర్/ కొయీ సుహాగ్ బచారహే జేవర్ బేచ్‌కర్/బాప్ నె ఉమర్ గుజారీధీ ఘరొందే బనానేమె/బేటా ఉస్‌కి సాంసే ఖరీద్ రహే హై గర్ బేచ్‌కర్/ బర్బాద్ హెూగయే/ కయీ ఘర్ దవా ఖరీద్‌నేమే / కుచ్ లోగోంకి తిజోరీ భర్‌గయీ జహర్ బేచ్‌కర్"

భారత ప్రధాని అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు " మై యుద్ధ్‌కి దేశ్ సే నహీ ఆయా/మై బుద్ధ్ కి దేశ్ సే ఆయా హు" అనిగొప్పగా చెప్పుకున్నాడు. అంటే నేను యుద్ధాలు చేసే దేశం నుండి రాలేదు. నేను బుద్ధుడు పుట్టిపెరిగిన దేశం నుండి వచ్చాను అని అర్థం!అలా చెప్పుకోవడం బాగుంది. కానీ, నేను ముఖం నుండి మనుషులు పుట్టే దేశం నుండి వచ్చాను. భుజాల నుండి మనుషులు పుట్టే దేశం నుండి వచ్చాను అని ఎందుకు చెప్పుకోలేదూ? వినాయకుడికి ప్లాస్టిక్ సర్జరీ జరిగిన దేశం నుండి వచ్చాను అని కదా చెప్పుకోవాలి. మరి అలా ఎందుకు చెప్పుకోలేక పోయారూ? అలా చెప్పుకుంటే, ప్రపంచపౌరులు నవ్వుకుంటారని భయం. ఒకప్పుడు గుజరాత్‌లో ఇప్పుడు మళ్లీ మణిపూర్‌లో నరమేధం జరుగుతూ ఉంటే దేశ ప్రధాని మౌనవ్రతం చేపట్టడమేమిటీ? దేశ ప్రజలకు భరోసా ఇచ్చి, ధైర్యం చెప్పి, సమస్యను పరిష్కరించాల్సింది ఎవరూ? గత్యంతరంలేక నిండు పార్లమెంటులో విపక్షనేత 'తమరు దేశ భక్తులు కారు. దేశద్రోహులు' అని గొంతెత్తి అరవాల్సిన పరిస్థితి వచ్చింది కదా?

ఈ దేశ పాలకులు రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటున్నారా? లేక మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తున్నారా? ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఎంతకాలం అధికారం వెలగబెట్టగలరూ? 'మీ విద్వేషపు బజారులో మేం ప్రేమ దుకాణాలు తెరస్తూ వెళతాం' అని అన్నారు విపక్షనేత రాహుల్. "డెమొక్రసీ హమారీ డీఎన్ఏ మే హై" అని దేశ ప్రధాని అమెరికా వైట్‌హౌస్‌లో గొంతుచించుకుని వచ్చారు. అసలు ఆయనకు డెమొక్రసీ అనే పదం ఉచ్ఛరించే అర్హత ఉందా? అని దేశ పౌరులు ఆలోచనలో పడ్డారు. వాస్తవాల్ని తొక్కిపెట్టి గాలికబుర్లు చెప్పేవారిని ఈ ఆధునిక ఆలోచనా యుగంలో నిజం విశ్వసించరు. మణిపూర్‌లో ఇద్దరు కుకీ తెగ మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటనపై అగ్రరాజ్యం అమెరికా ఆగ్రహించింది. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపింది. మానవ హక్కుల్ని కాపాడాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్ని కోరింది. "మణిపూర్ మె భారత్ మాతాకి హత్యా హు ఈ హై" అని విపక్షనేత గొంతుచించుకుని అరిచిన అరుపు పార్లమెంటులోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనించింది. జాతులు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్ల కోసం కుట్రలు చేసే పాలకులు మతాన్ని దోపుడు కర్రలుగా చేసుకుని, ప్రభుత్వాన్ని నడిపిస్తూ ఉంటే ఏమనుకోవాలీ? అదొక వికలాంగ ప్రభుత్వం మనుకోవాలి! మతం వేరు-ప్రజాస్వామ్యం వేరు అని పాలకులు గ్రహించినపుడు కదా మళ్లీ దేశ ఆరోగ్యం పునరుద్ధరించబడేదీ? రాహుల్‌గాంధీ ఆక్రోశాన్ని పార్లమెంటు రికార్డుల్లోంచి తొలగించుకోగలరు. కానీ, ప్రపంచపౌరుల మనసుల్లోంచి తొలగించలేరు.

సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా: కేఎస్ ఈశ్వరప్ప

బెంగళూరు: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో షిమోగా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప తెలిపారు. తన కుమారుడు కేఈ కాంతేశ్‌కు హావేరీ టికెట్ దక్కకపోవడంతో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు బీఎస్ యడియూరప్పపై ఈశ్వరప్ప మండిపడ్డారు. వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా, హిందుత్వ కోసం పోరాడతానని ఈశ్వరప్ప పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీకి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. షిమోగా మద్దతుదారులతో దాదాపు రెండు గంటలపాటు సమావేశమైన అనంతరం ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. బీజేపీని, దాని సిద్ధాంతాలను కాపాడటానికే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి సన్నద్ధమైనట్లు, మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు తాను చేస్తున్న పోరాటమని ఈశ్వరప్ప అన్నారు. ప్రస్తుతం ఈ చర్యకు పూనుకోవడం వల్ల బీజేపీ తనకు నోటీసు ఇచ్చే అవకాశం ఉంది లేదా పార్టీ నుంచి బహిష్కరించే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను గెలిస్తే.. తప్పకుండా బీజేపీకి మద్దతు ఇస్తానని ఆయన అన్నారు. యడియూరప్ప కుమారుడు, సిట్టింగ్ ఎంపీ బీవై రాఘవేంద్ర మరోసారి షిమోగా స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

రతన్ టాటాకు పీవీ నరసింహారావు స్మారక అవార్డు

న్యూఢిల్లీ: టాటా సన్స్ మాజీ ఛైర్మన్, దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటా ప్రతిష్ఠాత్మక పీవీ నరసింహారావు స్మారక అవార్డు అందుకున్నారు. దాతృత్వంలో ఆయన చేసిన విశేష కృషికిగాను ఈ అవార్డుతో సత్కరించారు. ముంబైలో జరిగిన వేడుకలో ఆయనకు పీవీ నరసింహారావు స్మారక అవార్డును ప్రదానం చేశారు. రతన్ టాటా తన ఆదాయంలో సగానికిపైగా దాతృత్వానికి విరాళంగా ఇచ్చిన సంగతి తెలిసిందే. టాటా ట్రస్ట్‌ల ద్వారా విరాళాలు ఇస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఆయన అందించిన విరాళాలతో దేశవ్యాప్తంగా లక్షల మంది ప్రజలు లబ్ధి పొందారు. సాంఘిక, సంక్షేమ, మానవతా కారణాల కోసం అసాధారణమైన అంకితభావాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు గుర్తింపుగా ఈ అవార్డు అందిస్తుంటారు. రతన్ టాటా తన ఆదాయంలో సగానికిపైగా విరాళంగా ఇవ్వడమే కాకుండా టాటా ట్రస్టుల ద్వారా వివిధ రంగాలకు సాయం చేశారు. ప్రధానంగా ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి వాటి కోసం ఎక్కువగా విరాళాలు అందించారు. ఆయన చేసిన దాతృత్వ సేవలకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ ప్రశంసలు దక్కాయి. రతన్ టాటా (86) ఇప్పటికే రెండు భారత దేశ అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్నారు. 2000లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్‌తో సత్కరించింది. 2008లో పద్మ విభూషణ్ దక్కింది.

పీఎం సూర్య ఘర్‌కు కోటి దాటిన రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ: సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి, పౌరులపై విద్యుత్ ఛార్జీల భారం తగ్గించేలా 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకానికి కేంద్రం ఇటీవల శ్రీకారం చుట్టింది. దీనిద్వారా కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్తు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కోసం నమోదు చేసుకున్న కుటుంబాల సంఖ్య ఇప్పటికే కోటి దాటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఒక నెలలోనే ఈ స్థాయి స్పందన లభించిందని, ఇదొక అద్భుతమైన వార్త అని 'ఎక్స్' వేదికగా మోదీ పేర్కొన్నారు. 'సూర్య ఘర్ పథకానికి దేశవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు వెల్లువెత్తుతున్నాయి. అసోం, బీహార్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో 5 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి' అని ప్రధాని చెప్పారు. ఈ పథకం విద్యుత్ ఉత్పత్తితోపాటు కరెంటు బిల్లులు గణనీయంగా తగ్గుముఖం పట్టేందుకు దోహదపడుతుందని, ఇటువంటి పర్యావరణహిత చర్యలు, భూగ్రహంపై జీవన పరిస్థితులు మరింత మెరుగయ్యేందుకు తోడ్పడతాయని తెలిపారు. ఇంతవరకు నమోదు చేసుకోనివారూ ముందుకురావాలని ప్రధాని పిలుపునిచ్చారు.

మధ్యప్రదేశ్ బీజేపీలో అసంతృప్తి జ్వాల

ఎంపీ అజయ్ ప్రతాప్‌సింగ్ రాజీనామా



భోపాల్: మధ్యప్రదేశ్ బీజేపీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. రాజీనామాలతో కాషాయ పార్టీకి నాయకులు షాకిస్తున్నారు. తాజాగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు అజయ్ ప్రతాప్‌సింగ్ రాబోయే లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై అసంతృప్తితో ఉన్నారు. దీంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను సోషల్ మీడియాలో షేర్ చేసిన ప్రతాప్ సింగ్... 'పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను' అని పేర్కొంటూ తన నిర్ణయాన్ని వెల్లడించారు. రాజీనామాకు నిర్దిష్ట కారణాన్ని సింగ్ లేఖలో వెల్లడించనప్పటికీ పార్టీ నామినేషన్ ప్రక్రియపై తన అసంతృప్తిని ఎత్తిచూపారు. 'బీజేపీ చెప్పేదానికి, చేసేదానికి తేడా ఉంది' అని ఉదహరించారు. మార్చి 2018లో బీజేపీ తరఫున రాజ్యసభలో అడుగు పెట్టిన ప్రతాప్ సింగ్ పదవీకాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. కాగా, బీజేపీ ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో తనపేరు లేకపోవడంపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సీఏఏపై సుప్రీంకు ఒవైసీ

న్యూఢిల్లీ: ఇటీవలే అమలులోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై స్టే ఇవ్వాలని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టులో శనివారం పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా సీఏఏ కింద కొత్తగా ఎవరికీ పౌరసత్వం ఇవ్వవద్దని పిటిషన్‌లో ఒవైసీ కోరారు. కాగా, 2019లో కేంద్రం తీసుకువచ్చిన సీఏఏ చట్టానికి సంబంధించి తాజాగా కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ చట్టం ప్రకారం పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి డిసెంబర్ 31,2014కు ముందు దేశంలోకి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇస్తారు. సీఏఏ పోర్టల్‌లో దరఖాస్తు చేసిన కొందరు శరణార్థులకు ఇప్పటికే భారత పౌరసత్వం కల్పించారు.

బీజేపీ గూటికి అనూరాధ పౌడ్వాల్

న్యూఢిల్లీ: బాలీవుడ్ ప్రముఖ గాయని అనూరాధా పౌడ్వాల్ బీజేపీలో చేరారు. శనివారం ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. సనాతన ధర్మానికి కట్టుబడిన బీజేపీలో చేరడం తనకు సంతోషంగా ఉందని పౌడ్వాల్ అన్నారు. అనూరాధా పౌడ్వాల్ వివిధ భాషల్లో వందలాది పాటలు, భజనలు పాడారు. కర్నాటకలోని క్వారాల్‌లో జన్మించిన ఆమె... 19వ ఏటనే 'అభిమాన్' చిత్రంలో 'ఓకారం బిందు సంయుక్తం' అనే పాటతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఎస్‌డీ బర్మన్ ఈ పాట కంపోజ్ చేశారు. 1983లో 'హీరో' చిత్రంలో ఆమె పాడిన 'తూ మేరా హీరో హై' పాట సూపర్‌హిట్ అయింది. ఆ తర్వాత నాలుగుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 1990 దశకంలో ఆమె దూసుకెళ్లారు. 'ఆషికీ', 'సడక్', 'దిల్ హై కి మాన్తా నహీ' సౌండ్ ట్రాక్స్ సంగీత ప్రియులను ఉర్రూతలూగించాయి. 2000 తర్వాత ఎక్కువగా భక్తిగీతాలపై ఆమె దృష్టి సారించారు. 2016లో సూర్యోదయ ఫౌండేషన్ స్థాపించి పేదలకు ఆరోగ్య సేవలు అందించారు. 2011లో మదర్ థెరీసా అవార్డు అందుకున్నారు. 2017లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

ఎల్ఐసీ ఉద్యోగుల వేతనం పెంపు

న్యూఢిల్లీ: తన ఉద్యోగులకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) శుభవార్త చెప్పింది. ఆగస్టు 2022 నుంచి ప్రాథమిక వేతనాలను 16 శాతం పెంచడానికి ప్రభుత్వం తెలిపింది. ఈ తాజా నిర్ణయంతో ఎల్ఐసీ ఉద్యోగులు రెండేళ్లుగా ఉన్న బకాయిలు పొందనున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆమోదం తెలిపిన ప్రాథమిక వేతనం పెంపుతోపాటు అలవెన్సులతో కలిపి మొత్తం 22 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ వేతన పెంపుతో 1.10 లక్షల మందికి పైగా ఉద్యోగులు, 30 వేల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎల్ఐసీకి వార్షికంగా రూ.4,000 కోట్లకు పైగా ఆర్థిక భారం పడనున్నట్లు అంచనా. పెంపు తర్వాత ఎల్ఐసీ వేతన బిల్లు రూ.29 వేల కోట్లకు చేరుతుంది. 2010 ఏప్రిల్ తర్వాత సంస్థలో చేరిన దాదాపు 24 వేల మంది ఉద్యోగుల ఎన్‌పీఎస్ వాటాను 10 శాతం నుంచి 14 శాతానికి పెంచారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజలకు ప్రధాని మోదీ లేఖ



న్యూఢిల్లీ: భారతదేశ భవిష్యత్తును 'విక్షిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం)గా పునర్నిర్మించడంలో పౌరులు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మోదీ శనివారం దేశ ప్రజలనుద్దేశించి లేఖ రాశారు. ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రగతిశీల దేశం కోసం పౌరుల మద్దతు ఎంత ముఖ్యమో ఆయన గుర్తు చేశారు. 'ప్రభుత్వ విధానపర నిర్ణయాల్లో పౌరులు తమ ఆలోచనలు, సూచనలు పంచుకోవాలి. అభివృద్ధి చెందిన భారత్ సంకల్పాన్ని నెరవేర్చడానికి ప్రజలు ముందుకు రావాలి. గడిచిన 10 ఏళ్లలో బీజేపీ సర్కార్ ఎన్నో అభివృద్ధి పథకాలు చేపట్టింది. ఎన్నో మైలురాళ్లు చేరుకుంది. నిరుపేదలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. తద్వారా ఆయావర్గాల ప్రజల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. దేశ ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. సంస్కృతీసంప్రదాయాలు కాపాడుతూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నాం. జీఎస్టీ అమలు, ట్రిపుల్ తలాక్ వ్యతిరేక చట్టాలు, ఆర్టికల్ 270 రద్దు, నారీశక్తి బంధన్ వంటి అనేక చట్టాలు తీసుకొచ్చాం. తద్వారా మహిళల సాధికారితకు పెద్దపీట వేశాం. ఉగ్రవాదం, నక్సలిజాన్ని తగ్గించగలిగాం' అని మోదీ లేఖలో పేర్కొన్నారు.

నితీశ్‌కు హోంశాఖ, చౌదరికి ఆర్థికశాఖ

పాట్నా: బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం తమ మంత్రులకు శాఖలు కేటాయించింది. హోంశాఖతో పాటు సాధారణ పరిపాలన విభాగాల బాధ్యతలను ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేపట్టగా ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరికి ఆర్థిక, వాణిజ్య శాఖలను కేటాయించారు. మరొక ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హాకు రోడ్డు నిర్మాణం, మైన్స్, జియోలజీ, కళ-సంస్కృతుల శాఖల బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కేబినెట్ సెక్రటేరియట్ విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. 21 మందికి కొత్తగా మంత్రుల పదవులు కట్టబెడుతూ కేబినెట్‌ను శుక్రవారం విస్తరించిన విషయం తెలిసిందే. తాజా చేర్పింపుతో మంత్రుల సంఖ్య 30కు పెరిగింది.

తొలిసారి ఓటర్లు 1.85 కోట్లు

ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ: ప్రపంచమంతా భారత్‌లో జరగబోయే ఎన్నికల వైపు చూస్తోందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. ప్రతీ ఎన్నిక ఒక పరీక్ష లాంటిదేనని, ప్రతీ పరీక్షలోనూ విజయం సాధించాలనేది ఈసీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలు అని అభిప్రాయపడ్డారు. ఇక 2024ను ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల సంవత్సరంగా పిలవొచ్చన్నారు. దేశంలో తొలిసారి ఓటు వేయనున్న యువత 1.85 కోట్లని తెలిపారు. 85 ఏళ్లు పైబడిన వారికి, వికలాంగులకు ఇంటి నుంచి ఓటువేసే అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 12 రాష్ట్రాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య 96.8 కోట్లు అని తెలిపారు. అందులో పురుషులు 49.7 కోట్లు, మహిళలు 47.1 కోట్లు కాగా ట్రాన్స్‌జెండర్లు 48 వేలమంది అని వివరించారు. 85 ఏళ్ల వయసు దాటిన ఓటర్లు 82 లక్షలు, 20-29 మధ్య వయసున్న ఓటర్లు 19.74 కోట్లు, 18-19 మధ్య వయసున్న ఓటర్లు 1.8 కోట్లు ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల కోసం 55 లక్షల ఈవీఎంలు ఉపయోగిస్తున్నామని, 10.5 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1.5 కోట్ల మంది పోలింగ్ అధికారులు, భద్రతా సిబ్బందిని నియమించినట్లు రాజీవ్ కుమార్ చెప్పారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్, గోవా, సిక్కిం మినహా అన్ని రాష్ట్రాలు, దిల్లీ, జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాల్లో పార్లమెంటరీ స్థానాల అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షలు ఖర్చు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ మూడు రాష్ట్రాలు, మిగతా కేంద్రపాలిత ప్రాంతాల అభ్యర్థులకు మాత్రం రూ.75 లక్షల పరిమితి విధించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షలు, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అభ్యర్థులు రూ.28 లక్షలు ఖర్చు చేసుకోవచ్చని తెలిపారు. షెడ్యూల్ రాకతో అన్ని రాజకీయ పార్టీలు ప్రచారం ఉధృతం చేయనున్నాయి. ఈ క్రమంలో పార్టీలు రెడ్‌లైన్ దాటొద్దని రాజీవ్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు అడ్వైజరీని జారీ చేశారు. ఎలాంటి విద్వేష ప్రసంగాలు చేయకూడదని, కులం, మతం ఆధారంగా ఓట్లు అడగొద్దని, వ్యక్తిగత జీవితం లక్ష్యంగా విమర్శలు ఉండరాదని, ధ్రువీకరణ లేని, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు దూరంగా ఉండాలని రాజకీయ పార్టీలకు హితవు పలికారు. ప్రత్యర్థులను అవమానపరిచేలా సోషల్ మీడియా పోస్టులు పెట్టకూడదన్నారు. ప్రచార సమయంలో రాజకీయ పార్టీలు దివ్యాంగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రచారంలో పిల్లల్ని ఉపయోగించడం నిషిద్ధమని స్పష్టంచేశారు.

ఈ సందర్భంగా నకిలీ సమాచారంతో జాగ్రత్తగా ఉండాలని రాజీవ్ కుమార్ హెచ్చరించారు. పార్టీలు బాధ్యతాయుతమైన సోషల్ మీడియా ప్రవర్తనను కలిగి ఉండాలని, నకిలీ వార్తల మూలకారకులపై కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆశలకు అఖిలేశ్ గండి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మరో ఆరుగురు అభ్యర్థులతో కూడిన నాలుగో జాబితాను సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) విడుదల చేసింది. దీనికి ముందు మూడు దశల్లో 31 మంది అభ్యర్థులను ఎస్పీ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాలకుగాను 37 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే శుక్రవారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో నగీనా సీటు చర్చనీయాంశంగా మారింది. నగీనా లోక్‌సభ స్థానం నుంచి మనోజ్ కుమార్ పోటీ చేస్తున్నట్లు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. మనోజ్ కుమార్ ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. అయితే అఖిలేశ్ యాదవ్ తీసుకున్న ఈ నిర్ణయం కాంగ్రెస్ ఆశలపై నీళ్లు జల్లినట్లు అయింది. యూపీలో మరికొన్ని చిన్న పార్టీలను ఇండియా కూటమిలోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ ఆజాద్‌కు కంచుకోటగా ఉన్న నగీనా స్థానంలో ఏ అభ్యర్థినీ నిలబెట్టవద్దని అఖిలేశ్‌కు కాంగ్రెస్ సూచించింది. తాజాగా అఖిలేశ్ యాదవ్ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ నేతలను ఆశ్చర్యానికి గురిచేసింది. మనోజ్ కుమార్‌ను నగీనా అభ్యర్థిగా చేయడం ద్వారా చంద్రశేఖర్ ఆజాద్ ఇకపై ఇండియా కూటమిలో చేరలేని పరిస్థితి ఏర్పడింది. యూపీలోని ఖతౌలీ, రాంపూర్, మొయిన్‌పురి ఉపఎన్నికల సమయంలో చంద్రశేఖర్ బహిరంగంగానే ఎస్పీ కూటమితో బరిలోకి దిగారు. చంద్రశేఖర్ అనేక సందర్భాలలో అఖిలేశ్ యాదవ్ పక్కన కనిపించారు. చంద్రశేఖర్ ఆజాద్ ఇండియా కూటమిలో ఉంటారని, నగీనా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు ప్రకటించారు. కాగా చంద్రశేఖర్ ఆజాద్ శనివారం నగీనాలో ర్యాలీ నిర్వహించారు. ఇక్కడి నుంచే తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆయన చాలాసార్లు ప్రకటించారు.

ఎన్నికల బాండ్లపై దుష్ప్రచారం

కిరణ్ మజుందార్‌షా వివరణ

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు ఇటీవల స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు తక్షణమే నిలిపివేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భారతీయ స్టేట్ బ్యాంక్ సమర్పించిన డేటాను ఈసీ ప్రజలకు అందుబాటులో ఉంచింది. మొత్తం 763 పేజీలతో ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేసింది. అందులో చాలా కంపెనీలకు చెందిన యాజమాన్యాలు ఈ బాండ్లు కొనుగోలు చేశాయి. తాజాగా సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల బాండ్లకు సంబంధించి వివిధ సమాచారం వైరల్‌గా మారుతోంది. తాజాగా కిరణ్ మజుందార్‌షా ప్రాతినిధ్యం వహిస్తున్న బయోకాన్ కంపెనీ తరపున నెలకు రూ.5 కోట్ల చొప్పున ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసినట్లు 'ఎస్.' అనే ఎక్స్‌ఖాతాలో పోస్టులు వెలిశాయి. ఈ వ్యవహారం కర్నాటక ఎన్నికల ముందే జరిగినట్లు అందులో తెలిపారు. దీనికి స్పందించిన షా 'అది తప్పు. దయచేసి లెక్కలు సరిచేసుకోండి' అంటూ బదులిచ్చారు. ఎన్నికల బాండ్ల ద్వారా కిరణ్‌షా రూ.6 కోట్లు విరాళంగా ఇచ్చినట్లు తెలిసింది. 'ఇది వాస్తవానికి రూ.6 కోట్లు. మీరు ఆ మొత్తాన్ని ఇతర పద్ధతుల ద్వారా చెల్లించారని భావిస్తే, దయచేసి వాటి వివరాలు చెప్పండి' అని మరో యూజర్ స్పందించారు. తాను పారదర్శకంగా ఉంటానని షా బదులిచ్చారు. మీరు సవరించినట్లు మొత్తం రూ.6 కోట్ల బాండ్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. బయోకాన్‌తోపాటు అనేక లిస్టెడ్, అన్‌లిస్టెడ్ హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్ కంపెనీలు బాండ్ల పథకంలో పాల్గొన్నాయి. వీటిలో ప్రముఖ పారాసెటమాల్ బ్రాండ్ డోలో, అరబిందో ఫార్మా, మ్యాన్‌కైండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, జైడస్ హెల్త్‌కేర్, నాట్కో సన్ ఫార్మా, టోరెంట్ ఫార్మా, పిరమల్ ఫార్మా, సిప్లా, గ్లెన్‌మార్క్, లుపిన్, ఇప్కా, అజంతా ఫార్మా ఉన్నాయి. అన్‌లిస్టెడ్ కంపెనీల్లో హెటెరో డ్రగ్స్, హెటెరో ల్యాబ్స్, హెటెరో బయోఫార్మా, ఎంఎస్ఎన్ ల్యాబ్స్, మైక్రో ల్యాబ్స్, యూఎస్‌వీ, భారత్ బయోటెక్, చిరోన్ బెహ్రింగ్, బయోలాజికల్ ఇ, యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంస్థలు విరాళాలు ఇచ్చాయి. కంపెనీలు ఇచ్చే విరాళాలు పూర్తిగా క్విడ్ ప్రోకో ప్రయోజనాలకు అనుకూలంగా ఉండటంతో పారదర్శకత లోపించిందని, అందువల్ల ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చే విరాళాలను తప్పనిసరిగా బహిర్గతం చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. సంస్థల నుంచి అపరిమిత రాజకీయ విరాళాలను అనుమతించే 'కంపెనీల చట్టం'లో చేసిన సవరణలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని సుప్రీం తన తీర్పులో పేర్కొంది.

సముద్రపు దొంగల ఆటకట్టించిన భారత నేవీ

న్యూఢిల్లీ: భారత నేవీ మరోసారి సముద్రపు దొంగల ఆటలు సాగనివ్వలేదు. తమ ప్రాంతం ద్వారా ప్రయాణించే నౌకలను దోచుకునేందుకు దొంగలు చేసిన యత్నాలను అడ్డుకుంది. ఈ క్రమంలో భారత బలగాల వైపు పైరెట్లు కాల్పులు జరిపారు. దీనికి సంబంధించిన దృశ్యాలను నౌకాదళం ఎక్స్ (ట్విటర్) వేదికగా షేర్ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో ఎక్స్-ఎంవీ రూయిన్ నౌకను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. ఇతర దేశాల నౌకలను దోచుకునేందుకు దానిని ఉపయోగిస్తున్నారని భారత నేవీ గుర్తించింది.

దీంతో వారున్న ఆ షిప్‌ను అడ్డగించింది. ఆత్మరక్షణ, దోపిడీకి వ్యతిరేకంగా అంతర్జాతీయ చట్టాల ప్రకారం వారిపై చర్యలు తీసుకున్నామని చెప్పింది. కొందరు పైరెట్లు ఎక్స్-ఎంవీ రూయిన్ నౌక డెక్‌పైకి వచ్చి కాల్పులకు తెగబడ్డారు. వెంటనే లొంగిపోవాలని, ఎవరైనా పౌరులు బందీలుగా ఉంటే విడిచిపెట్టాలని తాము హెచ్చరించిట్లు పేర్కొంది. తాము సముద్ర భద్రతకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. ఇటీవల హిందూ మహాసముద్రంలో సముద్రపు దొంగలు రెచ్చిపోయిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్ జెండాతో ఉన్న ఓ కార్గో నౌకను హైజాక్ చేశారు. ఈ నౌక హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా సముద్రపు దొంగలు అందులోకి చొరబడ్డారు. ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి నౌకను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఆ నౌక నుంచి వచ్చిన అత్యవసర సందేశంపై మన నౌకాదళం స్పందించింది.

ప్రసార భారతి ఛైర్మన్‌గా నవనీత్ సెహగల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ప్రసార సంస్థ 'ప్రసార భారతి' ఛైర్మన్‌గా మాజీ అధికారి నవనీత్ సెహగల్‌ను కేంద్రం నియమించింది. సెలక్షన్ కమిటీ సిఫారసు మేరకు రాష్ట్రపతి ఈ నియామకం చేపట్టినట్లు శనివారం విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొన్నాయి. మూడేళ్ల కాలం లేదా సెహగల్‌కు 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు. 2020 ఫిబ్రవరిలో సూర్యప్రకాశ్ రాజీనామా చేసినప్పటి నుండి ప్రసార భారతి ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ సెలక్షన్ కమిటీకి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ నేతృత్వం వహించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్‌పర్సన్, రాష్ట్రపతి నామినేట్ చేసిన వ్యక్తి మిగిలిన సభ్యులుగా ఉన్నారు.

జేకేఎల్ఎఫ్‌పై మరో ఐదేళ్ల నిషేధం

జేకేపీఎల్‌పై కూడా: అమిత్‌షా

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్)పై నిషేధాన్ని మరో ఐదేళ్లకు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. యాసిన్ మాలిక్‌కు చెందిన ఈ సంస్థ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందునే నిషేధాన్ని పొడిగించినట్లు ఆయన శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని జేకేఎల్ఎఫ్ ప్రోత్సహిస్తోందని, దేశ భద్రత, సమగ్రత, సార్వభౌమతానికి సవాల్ విసురుతుతోందని ఆరోపించారు. అలాగే, జమ్మూకశ్మీర్ పీపుల్స్ లీగ్ (జేకేపీఎల్)కు చెందిన నాలుగు విభాగాలైన జేకేపీఎల్ (ముక్తార్ అహ్మద్ వజా), జేకేపీఎల్ (బషీర్ అహ్మద్ తోటా), జేకేపీఎల్ (గులాం మహమ్మద్ ఖాన్), జేకేపీఎల్ (అజీజ్ షేక్)పైనా నిషేధాన్ని పొడిగిస్తూ కేంద్ర హోంవ్యవహారాల శాఖ (ఎంహెచ్ఏ) నిర్ణయం తీసుకున్నట్లు అమిత్‌షా వెల్లడించారు. ఉగ్ర వాదాన్ని ప్రోత్సహించే వ్యక్తులు, సంస్థలను మోదీ ప్రభుత్వం ఉపేక్షించబోదని పేర్కొన్నారు. కాగా, సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడే కొన్ని గంటల ముందు అమిత్‌షా ఈ ప్రకటన చేశారు.

ఇసుక అక్రమ మైనింగ్ కేసు...

బీహార్‌లో ఈడీ తనిఖీలు

పాట్నా: బీహార్‌లో అక్రమ ఇసుక మైనింగ్ కేసుతో ముడిపడ్డ మనీలాండరింగ్ వ్యవహారంలో దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలోని భోజ్‌పూర్ జిల్లాలోని అర్రా పట్టణం చుట్టుపక్కల ఈడీ అధికారులు దాడులు జరిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వ్యాపారవేత్తతో పాటు మరికొందరు అనుమానస్తుల ఆస్తులను సోదా చేసినట్లు వెల్లడించాయి. నిందితుడు సుభాశ్ యాదవ్ గత వారంలో అరెస్టు కాగా ఇతనికి ఆర్జేడీతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. కాగా, బ్రాడ్‌సన్స్ కమోడిటీస్ ప్రై.లి. (బీసీపీఎల్)పై బీహార్ పోలీసులు 20కుపైగా దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కేసులో ఈడీ దర్యాప్తు సాగిస్తోంది. బీసీపీఎల్ డైరెక్టర్లు ఈ-చలాన్లు లేకుండా ఇసుక మైనింగ్‌ను అక్రమంగా సాగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. జేడీ(యూ) నేత, ఎమ్మెల్సీ రాధా చరణ్, ఆయన తనయుడు కన్హయ ప్రసాద్‌తో పాటు బీసీపీఎల్ డైరెక్టర్లు మిథిలేశ్ కుమార్ సింగ్, బాబన్ సింగ్, సురేంద్ర కుమార్ జిందాల్‌ను గతేడాదిలో ఈడీ అరెస్టు చేసింది. వీరంతా జైల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే 2023, నవంబరులో పాట్నాలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో వీరిపై చార్జిషీటు దాఖలైంది. బీసీపీఎల్‌లో కీలక సిండికేట్ సభ్యుడిగా సుభాశ్ యాదవ్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అక్రమ ఇసుక దందా ద్వారా రూ.161 కోట్లు ఆర్జించినట్లు ఈడీ తేల్చింది.

నాలుగు కొత్త తెగలకు 10 శాతం కోటా

శ్రీనగర్: గిరిజనుల (ఎస్‌టీ) జాబితాలో కొత్తగా చేర్చిన నాలుగు తెగలకు 10 శాతం రిజర్వేషన్ల అమలును జమ్మూకశ్మీర్ పరిపాలనా యంత్రాంగం ఆమోదించింది. దీంతో కేంద్రపాలిత ప్రాంతంలో గిరిజనుల (ఎస్‌టీ) మొత్తం రిజర్వేషన్ 20 శాతానికి చేరినట్లు సంబంధిత వర్గాలు శనివారం పేర్కొన్నాయి. ఓబీసీల జాబితాలో 15 కొత్త కులాలు చేర్చేందుకు ఆమోదించడంతో పాటు వారి రిజర్వేషన్లను 8 శాతానికి పెంచినట్లు తెలిపాయి. జమ్మూకశ్మీర్‌లో స్థానిక సంస్థల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడంతోపాటు మరో నాలుగు వర్గాలను ఎస్‌టీల జాబితాలో చేర్చే రెండు బిల్లులను పార్లమెంట్ ఫిబ్రవరిలో ఆమోదించిన సంగతి తెలిసిందే. గడ్డ బ్రాహ్మణ, కోలి, పెద్దారి ట్రైబ్, పహారీ జాతి సమూహాన్ని ఎస్‌టీ జాబితాలో చేరుస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే జాబితా అయిన తెగలతో పాటు కొత్తగా చేర్చిన నాలుగు తెగలకు సమానంగా, ప్రత్యేకంగా పదిశాతం రిజర్వేషన్ల ద్వారా లబ్ధి చేకూరుతుందని ఆ వర్గాలు తెలిపాయి. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నేతృత్వంలో జమ్మూలో సమావేశమైన పరిపాలనా యంత్రాంగం జమ్మూకశ్మీర్ రిజర్వేషన్ రూల్స్, 2005, జమ్మూకశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) చట్టం 2023తో పాటు సంబంధిత చట్టాలను సవరించాలన్న సాంఘీక సంక్షేమ శాఖ ప్రతిపాదనను ఆమోదించిందని పేర్కొన్నాయి.

వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 24 పార్లమెంటు నియోజక వర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గానికి మాత్రం అభ్యర్థిని ఖరారు చేయలేదు. శనివారం ఇడుపుల పాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం అక్కడ నుంచే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు అభ్యర్థుల పేర్లను చదివి వినిపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం సీట్లు కేటాయించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే అభ్యర్థులు

శ్రీకాకుళం - ధర్మాన ప్రసాదరావు
ఆమదాల వలస - తమ్మినేని సీతారాం
పాతపట్నం -రెడ్డి శాంతి
నరసన్నపేట - ధర్మాన కృష్ణదాస్
టెక్కలి - దువ్వాడ శ్రీనివాస్
ఇచ్ఛాపురం - పిరియా విజయ
పలాస - సీదిరి అప్పలరాజు
రాజాం (ఎస్సీ) - తలే రాజేశ్
విజయనగరం - కోలగట్ల వీరభద్రస్వామి
బొబ్బిలి- సంబంగి వెంకట చిన అప్పల నాయుడు
గజపతి నగరం- బొత్స అప్పల నర్సయ్య
చీపురుపల్లి- బొత్స సత్యనారాయణ
నెల్లిమర్ల -బడ్డు కొండ అప్పల నాయుడు
ఎచ్చెర్ల- గొర్లె కిరణ్‌కుమార్
గాజువాక - గుడివాడ అమర్‌నాథ్
విశాఖ (దక్షిణం) - వాసుపల్లి గణేశ్
విశాఖ (ఉత్తరం) - కేకే రాజు
భీమిలి - ముత్తంశెట్టి శ్రీనివాసరావు
విశాఖ (తూర్పు) - ఎంవీవీ సత్యనారాయణ
విశాఖ (పశ్చిమ) - అడారి ఆనంద్
శృంగవరపుకోట - కడుబండి శ్రీనివాసరావు
పెందుర్తి - అన్నంరెడ్డి అదీప్‌రాజ్
పాయకరావుపేట (ఎస్సీ) - కంబాల జోగులు
చోడవరం - కరణం ధర్మశ్రీ
నర్సీపట్నం - పెట్ల ఉమాశంకర్ గణేశ్
అనకాపల్లి - మలసాల భరత్‌కుమార్
మాడుగుల - బూడి ముత్యాల నాయుడు
ఎలమంచిలి - ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు (కన్నబాబు రాజు)
అరకు (ఎస్టీ) - రేగం మత్స్యలింగం
పాడేరు (ఎస్టీ) - మత్స్యరస విశ్వేశ్వరరాజు
రంపచోడవరం (ఎస్టీ) - నాగులపల్లి ధనలక్ష్మి
పార్వతీపురం (ఎస్సీ) - అలజంగి జోగారావు
కురుపాం (ఎస్టీ) - పాముల పుష్పశ్రీవాణి
సాలూరు (ఎస్టీ) - పీడిక రాజన్నదొర
పాలకొండ (ఎస్టీ) - విశ్వాసరాయి కళావతి
ప్రత్తిపాడు - వరుపుల సుబ్బారావు
జగ్గంపేట- తోట నరసింహం, తుని- దాడిశెట్టి రాజా
పిఠాపురం- వంగా గీత
కాకినాడ సిటీ - ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
కాకినాడ రూరల్ - కురసాల కన్నబాబు
పెద్దాపురం- దవులూరి దొరబాబు
రాజోలు (ఎస్సీ) - గొల్లపల్లి సూర్యారావు
కొత్తపేట - చిర్ల జగ్గిరెడ్డి
ముమ్మిడివరం - పొన్నాడ వెంకట సతీశ్ కుమార్
రామచంద్రపురం - పిల్లి సూర్య ప్రకాశ్
అమలాపురం (ఎస్సీ) - పినిపే విశ్వరూప్
పి.గన్నవరం - విప్పర్తి వేణుగోపాల్
మండపేట - తోట త్రిమూర్తులు
అనపర్తి - సత్య సూర్యనారాయణ రెడ్డి
గోపాలపురం (ఎస్సీ) - తానేటి వనిత
రాజానగరం - జక్కంపూడి రాజా
నిడదవోలు - గెడ్డం శ్రీనివాసనాయుడు
రాజమండ్రి సిటీ - మార్గాని భరత్‌రామ్
రాజమండ్రి రూరల్ - చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ
కొవ్వూరు (ఎస్సీ) - తలారి వెంకటరావు
నరసాపురం - ముదునూరి నాగరాజ వరప్రసాదరాజు
భీమవరం - గ్రంథి శ్రీనివాస్
ఆచంట - చెరుకువాడ శ్రీరంగనాథ రాజు
తణుకు - కారుమూరి వెంకట నాగేశ్వరరావు
ఉండి - పీవీఎల్ నరసింహరాజు
తాడేపల్లిగూడెం - కొట్టు సత్యనారాయణ
పాలకొల్లు - గూడాల శ్రీహరి గోపాలరావు
చింతలపూడి (ఎస్సీ) - కంభం విజయరాజు
నూజివీడు - మేకా వెంకట ప్రతాప అప్పారావు
దెందులూరు - కొఠారు అబ్బయ్య చౌదరి
కైకలూరు - దూలం నాగేశ్వరరావు
పోలవరం (ఎస్టీ) - తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు - ఆళ్ల నాని
ఉంగుటూరు - పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు)
పామర్రు (ఎస్సీ) - కైలే అనిల్ కుమార్
అవనిగడ్డ - సింహాద్రి రమేశ్ బాబు
మచిలీపట్నం - పేర్ని సాయికృష్ణ మూర్తి (కిట్టు)
పెడన - ఉప్పాల రమేశ్, గుడివాడ - కొడాలి నాని
గన్నవరం - వల్లభనేని వంశీ మోహన్
పెనమలూరు - జోగి రమేశ్
నందిగామ (ఎస్సీ) - మొండితోక జగన్మోహనరావు
తిరువూరు (ఎస్సీ) - స్వామిదాస్
విజయవాడ ఈస్ట్ - దేవినేని అవినాశ్
విజయవాడ వెస్ట్ - షేక్ ఆసిఫ్
విజయవాడ సెంట్రల్ - వెలంపల్లి శ్రీనివాస్
జగ్గయ్యపేట - సామినేని ఉదయభాను
మైలవరం - సర్నాల తిరుపతి రావు
తాడికొండ (ఎస్సీ) - మేకతోటి సుచరిత
ప్రత్తిపాడు (ఎస్సీ) - బాలసాని కిరణ్‌కుమార్
తెనాలి - అన్నాబత్తుని శివకుమార్
పొన్నూరు - అంబటి మురళి
గుంటూరు వెస్ట్ - విడదల రజని
మంగళగిరి - మురుగుడు లావణ్య
గుంటూరు ఈస్ట్ - షేక్ నూర్ ఫాతిమా
పెద్దకూరపాడు - నంబూరు శంకర్రావు
వినుకొండ - బొల్లా బ్రహ్మయ్యనాయుడు
సత్తెనపల్లి - అంబటి రాంబాబు, గురజాల - కాసు మహేశ్ రెడ్డి
చిలకలూరిపేట - కావటి శివనాగ మనోహర్‌నాయుడు
నరసరావుపేట - గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
మాచర్ల - పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
రేపల్లె - రేవూరి గణేశ్, బాపట్ల - కోన రఘుపతి
వేమూరు(ఎస్సీ) - వరికూటి అశోక్ బాబు
సంతనూతలపాడు (ఎస్సీ) - మేరుగ నాగార్జున
అద్దంకి - పాణెం చిన్న హనిమిరెడ్డి
పర్చూరు - ఎడం బాలాజీ, చీరాల - కరణం వెంకటేశ్
దర్శి - డా॥ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి
యర్రగొండపాలెం (ఎస్సీ) - తాటిపర్తి చంద్రశేఖర్
గిద్దలూరు - కుందూరు నాగార్జునరెడ్డి
ఒంగోలు - బాలినేని శ్రీనివాసరెడ్డి (వాసు)
కొండపి (ఎస్సీ) - ఆదిమూలపు సురేశ్
కనిగిరి - దద్దాల నారాయణయాదవ్, మార్కాపురం - అన్నా రాంబాబు
కందుకూరు - బుర్రా మధుసూదన్ యాదవ్
కావలి - రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి
కోవూరు - నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
నెల్లూరు సిటీ - మహమ్మద్ ఖలీల్ అహ్మద్
నెల్లూరు రూరల్ - ఆదాల ప్రభాకర్ రెడ్డి
ఉదయగిరి - మేకపాటి రాజగోపాల్ రెడ్డి
ఆత్మకూరు - మేకపాటి విక్రమ్ రెడ్డి, సర్వేపల్లి - కాకాని గోవర్ధన్ రెడ్డి
గూడూరు(ఎస్సీ) - మేరిగ మురళీధర్
శ్రీకాళహస్తి - బియ్యపు మధుసూదన్‌రెడ్డి
సూళ్లూరుపేట (ఎస్సీ) - కిలివేటి సంజీవయ్య
వెంకటగిరి - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
తిరుపతి - భూమన అభినయ్‌రెడ్డి, సత్యవేడు - నూకతోటి రాజేశ్
కుప్పం - కేజే భరత్, పలమనేరు - ఎన్.వెంకటే గౌడ
చంద్రగిరి - చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
గంగాధర నెల్లూరు (ఎస్సీ) - కలతూరు కృపాలక్ష్మి
నగరి - ఆర్‌కే రోజా, పూతలపట్టు - డాక్టర్ సునీల్‌కుమార్
చిత్తూరు - ఎం. విజయానందరెడ్డి
మదనపల్లె- నిషార్ అహ్మద్
పుంగనూరు - పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
పీలేరు - చింతల రామచంద్రారెడ్డి
తంబళ్లపల్లె - పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి
రాజంపేట - ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
కోడూరు (ఎస్సీ) - కె.శ్రీనివాసులు
రాయచోటి - గడికోట శ్రీకాంత్‌రెడ్డి
జమ్మలమడుగు - మూలే సుధీర్‌రెడ్డి
కడప - అంజద్‌బాషా
బద్వేలు (ఎస్సీ) - దాసరి సుధ
పులివెందుల - వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
కమలాపురం - రవీంద్రనాథ్‌రెడ్డి
మైదుకూరు - రఘురామిరెడ్డి
ప్రొద్దుటూరు - రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి
కోడుమూరు (ఎస్సీ) - ఆదిమూలపు సతీశ్
ఆదోని - వై.సాయి ప్రసాద్‌రెడ్డి
కర్నూలు - ఎండీ ఇంతియాజ్
మంత్రాలయం - వై. బాలనాగిరెడ్డి
ఎమ్మిగనూరు - బుట్టారేణుక
పత్తికొండ - కంగాటి శ్రీదేవి
ఆలూరు - బి. విరూపాక్షి
నందికొట్కూరు (ఎస్సీ) - డాక్టర్ దారా సుధీర్
బనగానపల్లి - కాటసాని రామిరెడ్డి
ఆళ్లగడ్డ - గంగుల బ్రిజేంద్రరెడ్డి (నాని)
శ్రీశైలం - శిల్పా చక్రపాణిరెడ్డి
నంద్యాల - శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
పాణ్యం - కాటసాని రాంభూపాల్‌రెడ్డి
డోన్ - బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
కదిరి - బీఎస్ మక్బూల్ అహ్మద్
పుట్టపర్తి - దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
హిందూపురం - టీఎన్. దీపిక
ధర్మవరం - కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి
పెనుకొండ - కేవీ ఉషశ్రీ చరణ్
మడకశిర - ఈర లక్కప్ప, రాప్తాడు - తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి
శింగనమల (ఎస్సీ) - మన్నెపాకుల వీరాంజనేయులు
తాడిపత్రి - కేతిరెడ్డి పెద్దారెడ్డి
అనంతపురం అర్బన్ - అనంత వెంకటరామిరెడ్డి
గుంతకల్లు - వై. వెంకటరామిరెడ్డి
ఉరవకొండ - వై. విశ్వేశ్వరరెడ్డి
కల్యాణదుర్గం - తలారి రంగయ్య
రాయదుర్గం - మెట్టు గోవిందరెడ్డి

ఎంపీ అభ్యర్థులు

అరకు - తనూజ రాణి
శ్రీకాకుళం - పేరాడ తిలక్
విజయనగరం - బెల్లాన చంద్రశేఖర్
విశాఖపట్నం - బొత్స ఝాన్సీ
కాకినాడ - చలమలశెట్టి సునీల్
అమలాపురం - రాపాక వరప్రసాద్
రాజమండ్రి - గూడూరు శ్రీనివాసరావు
నరసాపురం - ఉమాబాల
ఏలూరు - కారుమూరి సునీల్‌కుమార్
మచిలీపట్నం - సింహాద్రి చంద్రశేఖరరావు
విజయవాడ - కేశినేని శ్రీనివాస్
గుంటూరు - కిలారి వెంకట రోశయ్య
నరసరావుపేట - పోలుబోయిన అనిల్‌కుమార్
బాపట్ల - నందిగం సురేశ్
ఒంగోలు - చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
నంద్యాల - పోచా బ్రహ్మనందరెడ్డి
కర్నూలు - బీవై రామయ్య
అనంతపురం - మాలగుండ్ల శంకర నారాయణ
హిందూపురం - జోళదరాశి శాంత
కడప - వైఎస్ అవినాశ్ రెడ్డి
నెల్లూరు - విజయసాయి రెడ్డి
తిరుపతి - మద్దిల గురుమూర్తి
రాజంపేట - పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
చిత్తూరు - ఎన్ రెడ్డప్ప

ఎన్నికలకు ఇండియా సిద్ధం

- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు ఇదే చివరి అవకాశం
- విద్వేషం, నిరుద్యోగం, అధిక ధరలపై ఐక్యంగా పోరాడదాం
- నిరంకుశ పాలనకు అంతం పలుకుదాం
- ఎన్నికల షెడ్యూల్‌ను స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్, ఆప్



న్యూదిల్లీ:
సార్వత్రిక ఎన్నికలకు ప్రతిపక్ష కూటమి ఇండియా సిద్ధంగా ఉన్నదని, పూర్తి మెజారిటీ సాధించేందుకు నడుం బిగించిందని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించాయి. దేశాన్ని నిరంకుశత్వం నుంచి కాపాడుకునేందుకు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఇదే చివరి అవకాశమని లోక్‌సభ ఎన్నికలనుద్దేశించి ఉద్ఘాటించాయి. నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చాయి. లోక్‌సభ ఎన్నికలల్లో పూర్తి మెజారిటీ సాధించేందుకు ఇండియా కూటమి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రతినిధి గోపాల్ రాయ్ ప్రకటించారు. ఎన్నికల తేదీలపై ఎన్నికల సంఘం ప్రకటనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. విద్వేషం, నిరుద్యోగం, అధిక ధరలపై పోరునకు పౌరులంతా ఏకం కావాలని మల్లికార్జున ఖర్గే కోరారు. గత పదేళ్లలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసి రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిన మోదీ పాలన నుంచి విముక్తి కోసం దేశ ప్రజలు ఈ ఎన్నికల కోసం నిరీక్షిస్తున్నారని రాయ్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలతోనే భారత్‌కు 'న్యాయం' కోసం ద్వారాలు తెరుచుకుంటాయని చెప్పారు. హాత్ బదలేగా హాలాత్ ('చేయ్యి'తో పరిస్థితిలో మార్పు) అని 'హస్తం' గుర్తునుద్దేశించి ఖర్గే అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన క్రమంలో ఆయన 'ఎక్స్' మాధ్యమంగా ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నికలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందా లేదా అన్నది తేలనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడతారా లేక ఒక వ్యక్తి ఆశలు, ఆకాంక్షలాధారంగా ప్రజాస్వామ్య భవితవ్యం నిర్ణయమవుతుందా అన్నది స్పష్టమవుతుందన్నారు. ఎన్నికల బాండ్లు, నిర్బంధాలు, సస్పెన్షన్లు, విపక్ష పార్టీలు, రాజకీయ నాయకులపై దాడులు, ప్రధాన ప్రతిపక్ష పార్టీ నిధులు ఫ్రీజ్ చేయడం వంటి అసాధారణ పరిణామాల నడుమ కుంభకోణాల నీడలో 'మైలురాయి' ఎన్నికలు జరనున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంబద్ధ హోదాను బీజేపీ తగ్గించిందని, ఎన్నికల కమిషనర్ల నియామకంపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేసిందని చెప్పారు. రైతులు, యువత, మహిళలు ముఖ్యంగా నిరుద్యోగుల సమస్యలను భారత్ జోడో రెండు యాత్రల్లో ప్రముఖంగా ప్రస్తావించామన్నారు. యువత కోసం ఆలోచించే పార్టీని ఎన్నుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. 30లక్షల ఉద్యోగాల హామీ... పేపర్ లీక్‌ల కట్టడికి కఠిన చట్టాలు తేవడం వంటి హామీలతో దేశంలో రాజకీయాల తీరు మారిందని, ఈ సమస్యలను ఏ పార్టీ నిర్లక్ష్యం చేయలేదన్నారు. 18 మిలియన్ల మంది కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారని, యువతకు ఓటు హక్కు కల్పించిన రాజీవ్ గాంధీని స్మరించుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారని ఖేరా అన్నారు. బీజేపీ నినాదాలు కేవలం బీజేపీ ప్రయోజనాలకే పరిమితమని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇచ్చిన హామీలు దేశానికి, దేశ ప్రజల హితవు కోసమని నొక్కిచెప్పారు. రాగల రెండు నెలల్లో నిరంకుశ బీజేపీ, ప్రధాని నుంచి దేశం విముక్తి పొందబోతోందని పవన్ ఖేరా ఉద్ఘాటించారు. మరోవైపు ఆప్ దిల్లీ శాఖ కన్వీనర్ గోపాల్ రాయ్ వేరుగా విలేకరులతో మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా బీజేపీ పదేళ్ల పాలన సాగిందన్నారు. బీజేపీ పాలనలో అనుభవించిన బాధను వ్యక్తం చేసేందుకు ప్రజలు ఇదే అవకాశమని, అందుకోసమే వారంతా ఈ ఎన్నికల కోసం వేచివున్నారని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి ప్రచారాన్ని ఏకీకృతం చేసేందుకు దోహదమయ్యేలా తమ అభ్యర్థులను కాంగ్రెస్ త్వరగా ప్రకటించాలని రాయ్ సూచించారు. దిల్లీలో మే 25న ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే బీజేపీ ఏడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది.

అఖండ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి బీజేపీ: నడ్డా

వచ్చే ఐదేళ్ల కోసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని, మోదీ నాయకత్వంలో అఖండ మెజారిటీతో మరోమారు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా దీమాగా చెప్పారు. ఎన్నికల షెడ్యూల్‌ను స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని, ప్రతి ఒకరు ఓటు వేయాలని 'ఎక్స్' ద్వారా పిలుపునిచ్చారు. బీజేపీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ 'ఎన్నికల ప్రకటన వెలువడింది. దేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చర్యలు మొదలయ్యాయి' అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే వైభవంగా ఎన్నికల ఉత్సవం భారత్‌లో జరగనున్నదని, ఇందులో ఉత్సాహంగా పాల్గొనాలని ఓటర్లను కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తాం

- జూనియర్ న్యాయవాదులకు రూ.7 వేల గౌరవ వేతనం
- రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్
- లీగస్ సెల్ సదస్సులో చంద్రబాబు హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఉన్మాదుల నుండి స్వాతంత్ర్యం వచ్చినంత ఆనందంగా ప్రజలు పండుగ చేసుకుంటున్నారని, ఎన్నికల్లో జగన్‌కు దిమ్మతిరిగే ఫలితం రాబోతోందని అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పేరుతో నెలకు రూ.7 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. లా నేస్తం పేరుతో జగన్ కేవలం 2,670 మందికే గౌరవ వేతనం ఇచ్చారని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ సంఖ్యను 3,500దాకా పెంచుతామని భరోసా ఇచ్చారు. లాయర్లకు కార్పస్ ఫండ్ కింద రూ.100 కోట్లు కేటాయిస్తామన్నారు. విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో టీడీపీ లీగస్ సెల్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల సమ్మిట్‌లో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా లీగల్ సెల్ వర్క్‌షాప్‌లు పెట్టుకోవాల్సి వస్తోంది. నా నామినేషన్‌ను కార్యకర్తలు, న్యాయవాదులే వేసేవారు. కేవలం డిక్లరేషన్ పత్రంపైనే నేను సంతకం చేసేవాడిని. కానీ నేడు నాపై ఎన్నికేసులు ఉన్నాయో ముందుగానే డీజీపీని, అధికారులను లేఖల ద్వారా అడిగే పరిస్థితి నెలకొంది. అడగకపోతే ఎప్పుడు దొంగ కేసులు పెట్టారో తెలియదు. నామినేషన్ వేయాలనుకునే ప్రతి అభ్యర్థి తనపై ఎన్ని కేసులు ఎన్నాయో చెప్పండి అని అడుక్కునే దుస్థితి. రాజ్యాంగంలో శాసన, కార్యనిర్వాహక, మీడియా ప్రధానమైనవి. ఇవి గాడి తప్పితే మళ్లీ గాడిలో పెట్టేది న్యాయ వ్యవస్థే. న్యాయ వ్యవస్థ లేకపోతే మనం ఇక్కడ ఉండేవాళ్లం కాదు. నాతో పాటు మా లాయర్లు కూడా నిద్రలేని రాత్రులు గడిపారు. నా జీవితంలో లాయర్లపై దాడులు చేయడం ఇప్పుడే చూస్తున్నాను. వారే కోర్టుకు వెళ్లి దాడులు జరుగుతున్నాయని చెప్పుకునే పరిస్థితి దాపురించింది. ఎన్నికల కమిషర్‌కు కూడా దిక్కులేదు. రక్షణ కోసం కేంద్ర సాయం కోరే పరిస్థితి ఏర్పడింది. ప్రజలు గెలవాలి...రాష్ట్రం నిలవాలి అన్న నినాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ ముందుకు వెళుతున్నాయి. ఆదివారం ప్రధానితో ప్రజాగళం సభను చిలకలూరిపేటలో నిర్వహిస్తున్నాం. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు రాబోతున్నాయి. కేంద్రంలో 400 లోక్‌సభ సీట్లతో ఎన్డీయే, రాష్ట్రంలో ఎప్పుడూ లేని మెజారిటీతో టీడీపీ కూటమి గెలవబోతుంది' అని చంద్రబాబు చెప్పారు. లాయర్లకు స్వర్ణయుగం చూపించే పాలన తీసుకొస్తాం. రూ.5 లక్షల దాకా మెడికల్ క్లెయిమ్, రూ.15 లక్షల ప్రమాద బీమాకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించే బాధ్యత తీసుకుంటాం. న్యాయం కోసం పోరాడే మీకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఎన్నికల కోడ్ వచ్చింది. కాలర్ ఎగరేసుకుని ఇక బయటకు రండి. రాష్ట్రాన్ని కాపాడటానికి న్యాయవాదులు ప్రధాన బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రేపటి నుంచి పది పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 18న ఫస్ట్ లాంగ్వేజ్ గ్రూప్ ఏ, ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ 1 (కంపొజిట్ కోర్స్), 19న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీషు, 22న మేథమేటిక్స్, 23న ఫిజికల్ సైన్సెస్, 26న బయలాజికల్ సైన్స్, 27న సోషల్‌స్టడీ పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. 28 నుంచి 30 వరకు ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధంచేసింది. నెల రోజుల క్రితమే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలిచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఎన్నికల్లోపే అన్ని పరీక్షలను పూర్తి చేసే దిశగా ప్రభుత్వం సిద్ధమైంది. విద్యార్థుల చదువులపై ఎన్నికల ప్రభావం పడకుండా చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకిగాను ఏపీ టెట్, డీఎస్సీ షెడ్యూలు కూడా జారీజేసింది. టెట్ పరీక్షలు పూర్తికాగా, డీఎస్సీ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు ఉన్నత విద్యామండలి షెడ్యూలు జారీజేసింది.

మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం వద్దు

పాక్‌పై భారత్ ఆగ్రహం

ఐరాస:
అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ తీరును భారత్ ఎండగట్టింది. చెప్పిందే చెప్పే చెత్త రికార్డు ఆ దేశం సొంతమని మండిపడింది. ఐరాస జనరల్ అసెంబ్లీలో అయోధ్య రామాలయం, సీఏఏ గురించి ఆ దేశ రాయబారి లేవనెత్తడంపై భారత్ ఘాటుగా స్పందించింది. యూఎన్‌జీఏలో జరిగిన ప్లీనరీ సమావేశంలో పాకిస్థాన్ రాయబారి మునీర్ అక్రమ్ మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ, ఇటీవల అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) గురించి ప్రస్తావించారు. దీనిపై ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ స్పందించారు. 'నా దేశానికి సంబంధించిన విషయాలపై ఈ ప్రతినిధి బృందం సంకుచిత, తప్పుదోవ పట్టించే దృక్పథాన్ని కలిగిఉండటం దురదృష్టకరం. జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయస్థాయి కలిగిన లోతైన అంశాల గురించి పరిగణిస్తుంటే... మీ దగ్గర నుంచి భిన్నమైన వైఖరి కనిపిస్తోంది. ఎప్పుడూ చెప్పిందే చెప్పే చెత్త రికార్డు కలిగిన ఆ దేశ ప్రతినిధి బృందం... ప్రపంచం పురోగమిస్తోన్న తరుణంలో స్తబ్దుగా ఉండటం విచారకరం' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది జనవరిలో అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం జరిగింది. మరోవైపు రెండురోజుల క్రితం సీఏఏ విధివిధానాలపై కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వం ఇచ్చేందుకు వీలుగా కేంద్రం సీఏఏ-2019ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కొద్దిరోజుల క్రితం కూడా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాక్‌కు మనదేశం గట్టిగా బుద్ధి చెప్పింది. ఉగ్రదాడులతో పారిన రక్తంతో వారి చేతులు తడిసిపోయాయని న్యూదిల్లీ మండిపడింది. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు పాక్‌కు లేదని మరోసారి గట్టిగా హెచ్చరించింది.

నేడు ముంబైలో రాహుల్ న్యాయ సంకల్ప యాత్ర

ముంబై:
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్వర్యంలో సాగిన భారత్ జోడో న్యాయ యాత్ర ఆదివారం ముంబైలో ముగియనుంది. ఈ సందర్భంగా శివాజీ పార్కు వరకు 'న్యాయ సంకల్ప యాత్ర' పేరిట ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ ద్వారా ఇండియా కూటమి తమ బలాన్ని ప్రదర్శించబోతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ యాత్రలో పాల్గొనున్నారు. భారత్ జోడో న్యాయ యాత్ర దాదర్‌లోని అంబేద్కర్ స్మారకమైన చైత్ర భూమి వద్ద ముగుస్తుంది. ఆదివారం ఉదయం ముంబైలోని మణి భవన్ నుంచి ఆగస్ట్ క్రాంతి మైదాన్ వరకు న్యాయ సంకల్ప పాదయాత్రను రాహుల్ చేపడతారు. మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజయ్ వడెట్టివర్ కార్యాలయం ఈ మేరకు ప్రకటన వెలువరించింది. అన్ని రంగాల నుంచి ప్రముఖులు యాత్రలో పాల్గొనబోతున్నట్లు తెలిపింది. యాత్రలో పాల్గొన్న వారితో ఆగస్ట్ క్రాంతి మైదాన్ సమీపంలోని తేజ్‌పాల్ హాల్‌లో రాహుల్ మాట్లాడతారని వెల్లడించింది. మణి భవన్... మహాత్మాగాంధీ ముంబై నివాసం. శివాజీ పార్కు వద్ద సభలో రాహుల్ ప్రసంగిస్తారని విజయ్ వడెట్టివర్ పీటీఐకి తెలిపారు. సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, దిల్లీ ఆరోగ్య మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్, ఎన్సీ నేత ఫరూక్ అబ్దుల్లా, జార్ఖండ్ సీఎం చంపై సోరెన్, మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు హాజరవుతారని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.